నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

1

సోమవారం | 16 డిసెంబర్ 2024 | www.navatelangana.com

అంతర్జాతీయ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా వి ఎన్.చంద శ్రీధర్



నవతెలంగాణ-సంగారెడ్డి

అంతర్జాతీయ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా విఎన్. చంద శ్రీధర్‌కు నియామక పత్రాన్ని అంతర్జాతీయ అధ్యక్షులు విఎన్ ఇరుకుల్ల రామకృష్ణ అందచేశారు. ఆదివారం తుంకుమ్ కన్వెన్షన్ సెంటర్ మధురై తమిళనాడులో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సంగారెడ్డికి చెందిన వాసవి క్లబ్ సభ్యులు, ఆర్య వైశ్య సంఘం, బంధు మిత్రులు సభ్యులు అభినందనలు తెలిపారు.

జోగిపేటలో ఇంటింటికి సీపీఐ(ఎం) విరాళాల సేకరణ



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేటలో సీపీఐ(ఎం) ఇంటింటి విరాళాల సేకరణ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. సాయిలు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ(ఎం) కార్యకర్తలు, సానుభూతిపరులు, ఆయా ప్రజా సంఘాల నాయకులు పాల్గొ న్నారు. ఇంటింటికి తిరుగుతూ విరాళాలు సేకరించారు. సీపీఐ(ఎం)కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ ఏరియా కమిటీ కన్వీనర్ డి.విద్యాసాగర్, సభ్యులు నాగభూషణం, రాములు, కృష్ణ, శివకుమార్, సురేష్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు. .

హరీశ్ రావుపై యువ రైతు అభిమానం

వరి నారులో టిహెచ్ఆర్ అక్షరాలు కనిపించేలా ఏర్పాటు



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం మగ్ధుంపూర్ గ్రామానికి చెందిన ఓ యువ రైతు వరి పంట సాగులో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుపై అభిమానాన్ని, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డిపై విధేయతను వినూత్నంగా చాటుకున్నాడు. మగ్ధుంపూర్ గ్రామానికి చెందిన చిట్యాల సురేశ్ తన వరి నారు పొలంలో టీహెచ్ఆర్, జేఎస్ఆర్ అనే అక్షరాలు కనబడేలా వడ్లను పోసి (తూకం పోశాడు) అలుకుడు చేశాడు. ఆ అక్షరాలు నారులో అందంగా కనిపిస్తున్నాయి. చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. హరీశ్ రావు అంటే తనకు అభిమానమని, ఆయనపై ఉన్న అభిమానం, గౌరవంతో వినూత్నంగా వరి నారు టీహెచ్ఆర్ అనే ఆంగ్ల అక్షరాలు కనిపించేలా అలుకుడు చేసినట్లు చిట్యాల సురేశ్ తెలిపాడు. అంతేకాదు నంగునూరు మండల మాజీ మండల పరిషత్ అధ్యక్షుని పేరులోని పొడి ఆంగ్ల అక్షరాలు జేఎస్ఆర్ వరి నారుపై వచ్చేలా అందంగా తూకం పోసి జాప శ్రీకాంత్ రెడ్డిపై తన విధేయతను చాటుకున్నాడు.



కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లతో..

గ్రూప్-2 పరీక్షలు ప్రారంభం





పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్లు.

నవతెలంగాణ-సంగారెడ్డి/సిద్దిపేట/మెదక్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలు ఉమ్మడి మెదక్ జిల్లాలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభం అయ్యాయి..కొన్ని ప్రాంతాల్లో అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు 2 నిమిషాలు ఆల్యంగా వచ్చినా అధికారులు లోనికి అనుమతించలేదు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. అభ్యర్థులు తమ బ్యాగులు, సెల్‌ఫోన్లను భద్రపర్చే విషయంలో కొన్ని ప్రాంతాల్లో అభ్యర్థులు, సిబ్బందికి మధ్య వాదోపవాదాలు జరిగాయి. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఒక మెడికల్ కళాశాలలో సెల్‌ఫోన్లు, బ్యాగులను భద్రపర్చుకునేందుకు రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేయడంతో కొద్ది సేపు అభ్యర్థులు, అభ్యర్థుల బంధువులు ఆందోళన చేపట్టారు.పోలీసుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది.

సంగారెడ్డిలో..

జిల్లా కేంద్రం లోని సెయింట్ ఆన్స్, పయనీర్ పాఠశాలల్లో,కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా క్రాంతి వల్లూరు, ఎమ్మెన్నార్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌లు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గ దర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఆదివారం ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు జిల్లాలో ఆదివారం జరిగిన మొదటి సెషన్ పరీక్షకు 48 శాతం మంది విద్యార్థులు హాజరు అయ్యారు. 42 శాతం మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. పేపర్ 2(రెండవ సెషన్) పరీక్షకు 47.4 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు అయ్యారన్నారు. ఆది, సోమవారాల్లో ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో జరిగే గ్రూప్-2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వల్లూరు క్రాంతి వెల్లడించారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట పట్టణంలో 37 సెంటర్‌లలో 13717 మంది అభ్యర్థులను కేటాయించారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగు పేపర్ 1 పరీక్షకు పరీక్ష కేంద్రంలోకి ఉదయం 8:30 గంటల నుండి 9:30 గంటల వరకు విద్యార్థులను సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి లోనికి అనుమతించారు. అభ్యర్థుల నుంచి బయోమెట్రిక్‌ను తీసుకున్నారు. ఉదయం జరిగిన పరీక్షకు 13717 మందికి గాను 7005 విద్యార్థులు హాజరయ్యారు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 గంటల వరకు జరిగిన రెండో పేపర్ కు 6955 మంది విద్యార్థులు హాజరయ్యారనీ అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి, పోలీస్ కమిషనర్ అనురాధలు పరీక్ష జరుగుతున్న సెంటర్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ ను అమలు చేశారు.

మెదక్‌లో..

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభం అయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అని గమనించి పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఆదివారం ఉదయం సెషన్ లో జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 5,855 మంది అభ్యర్థులకు , 2,868 మంది హాజరు కాగా, 2,987 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 2859 మంది అభ్యర్థులు పరీక్ష రాయిగా, 2,996 మంది గైర్హాజరు అయ్యారని అధికారులు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు.పోలీసు అధికారులు. భారీ ఎత్తున భద్రత ఏర్పాటు చేశారు. స్పెషల్ బ్రాంచ్ ఇంటెలిజెన్స్ పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.

దొంగతనం చేసిన వ్యక్తి రిమాండ్

ఎస్సై అపూర్వ రెడ్డి



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

దొంగతనం చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపారు. సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన పిట్ల రాజు గతంలో సిద్దిపేటలో రెస్టారెంట్ ,రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయగా నష్టం వచ్చింది. అప్పటి నుంచి గ్రామంలో ఉంటూ మేస్త్రిగా కూలి పని చేస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవాడు. జల్సాలకు డబ్బులు సరిపోనందున దొంగతనాలు చేయాలని నిర్ణయించుకొని అక్టోబర్ నెలలో మాచాపూర్‌లో ఒక ఇల్లు తాళం పగులగొట్టి దొంగతనం చేశాడు. అందరికీ అనుమానం వస్తుందనుకొని ఎవరికీ చెప్పకుండా ఇంటిలో నుండి వెళ్ళిపోయాడు. శనివారం బూరుగుపల్లి చౌరస్తలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. దొంగలించిన సొత్తులో కొంత భాగం అమ్మడానికి వెళుతుండగా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అల్మాయిపేట మంజీరా నదిలో మొసలి



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని మంజీరా తీర ప్రాంతమైన అల్మాయిపేట, అందోలు గ్రామాల నదిలో ఒడ్డుకు మొసళ్ల సేద తీరడానికి రావడం కలకలం రేపింది. దీంతో మత్స్యకారులు, రైతులు భయందోళనలు వ్యక్తం చేస్తు న్నారు. అందోలు మండలం పరిధిలోని అల్మాయిపేట, చందంపేట గ్రామాల మధ్యన గల మంజీర నది వద్ద ఉన్న బండరాయిపై ఆదివారం పెద్ద సైజులో ఉన్న మొసలి సేద తీరడాన్ని అందోలు-జోగిపేట మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడు నాగరాజు వీడియో, ఫోటోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో పెట్టారు. దాంతో మొసళ్ల ప్రత్యక్షంపై సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రెండు రోజుల క్రితం అందోలు శివారులోని శ్రీనివాస్‌రెడ్డి పొలం సమీపంలో రెండు మొసళ్లు ప్రత్యక్షమయ్యాయి. వీటిని కూడా మత్స్యకారులే చూసి స్థానికులకు తెలియజేశారు. ఈ విషయమై పోలీసుల దృష్టికి తీసుకువెళ్లగా తమకు ఎలాంటి సమాచారం లేదని వారు తెలిపారు. ఏది ఏమైనప్పటికిని అందోలు, అల్మాయిపేట శివారు ప్రాంతంలోని మంజీర నీటి ఏరియాలోకి వెళ్లే మత్స్యకారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు. సింగూరు ప్రాజెక్టు ద్వారా మంజీర నదిలోకి నీరు వదిలినప్పుడు మొసళ్లు వరదలో ఇటువైపు కొట్టుకు రావచ్చునని స్థానికులు భావిస్తున్నారు.

సీపీఐ(ఎం) మహాసభలను జయప్రదం చేయాలి

ఆహ్వాన సంఘం చైర్మెన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

సంగారెడ్డిలో ఇంటింటి క్యాంపెయిన్..



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలో తొలిసారిగా జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మహాసభల ఆహ్వాన సంఘం చైర్మెన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పిలుపునిచ్చారు. సంగారెడ్డి పట్టణంలోని వీరభద్రనగర్‌లో సీపీఐ(ఎం) ఇంటింటి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చుక్కా రాములు హాజరై మాట్లాడు తూ.. దేశంలో అన్ని పార్టీలు అవినీతిలో కూరుకుపోయాయని సీపీఐ(ఎం) మాత్రం ఎలాంటి అవినీతి మచ్చ లేకుండా నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్నదన్నారు. మహాసభల విజయవంతం కోసం ప్రతీ గ్రామం, వార్డు పట్టణాల్లో కార్యకర్తలతో విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ఇంటింటి విరాళాలు సేకరణ చేస్తున్నామన్నారు. ఈ మహాసభలకు జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు, రాష్ట్ర నలుమూలల నుండి ప్రతినిధులు హాజరుకాను న్నారన్నారు. జనవరి 25న సంగారెడ్డి పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. సీపీఐ(ఎం) ప్రజా, కార్మిక, కర్షక, రైతాంగ పోరాటాల నిర్వహించి ప్రజల మద్దతు పొందిందన్నారు. సీపీఐ(ఎం) విధానాలు, పోరాటాలు, ఎర్రజెండా గొప్పదనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళి మహాసభల ప్రచారం చేస్తున్నామన్నారు. ప్రజలు ఎర్రజెండా మహాసభలకు ఆర్థికంగా, హార్దికంగా సహకరిసు న్నారన్నారు. బూర్జువా పార్టీలకు భిన్నంగా ప్రత్యామ్నాయ విధానాలతో సీపీఐ(ఎం) పని చేస్తున్నదన్నారు. భవిష్యత్తులో మరిన్ని సమరశీల పోరాటాలు సాగించే దిశగా మహాసభల్లో నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీరం మల్లేశం, అతిమేల మాణిక్, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, రేవంత్‌కుమార్, కృష్ణ,నాయకులు అశోక్, బాలరాజ్ శ్రీని వాస్, చంద్రన్న, మల్లారెడ్డి, విటల్, ప్రవీణ్, దత్తు, సురేష్, రమేష్, మైపాల్,చంద్రరెడ్డి, భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేను సైతం..

దాచుకున్న గల్లాపెట్టే డబ్బులను మహాసభలకు అందించిన బాలుడు..



అభినందించిన చుక్క రాములు...

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల విజయవంతానికి తాను సైతం అని ఓ పిల్లాడు ముందుకొచ్చాడు. తాను దాచుకున్న గల్లా పెట్టే డబ్బులను మహాసభల కోసం అందించాడు. కేవల్ కిషన్ భవన్ ఆఫీస్ వాచ్మెన్‌గా పనిచేస్తున్న ఎం.సాయిలు, మమత దంపతుల కొడుకు ఎం.రిత్విక్ తాను దాచుకున్న గల్లాపెట్టే డబ్బులు వేయి రూపాయలను సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ చుక్క రాములుకు అందజేశారు. దాంతో రిత్విక్‌ను అలాగే సాయిలు, మమత దంపతులను చుక్క రాములు అభినందించారు.

గ్రూప్ 2 పరీక్షా కేంద్రాలను సందర్శించిన ఎఎస్పీ



నవతెలంగాణ-మెదక్ డెస్క్

తూప్రాన్ పట్టణంలోని గ్రూప్ టు పరీక్ష కేంద్రాలను మెదక్ జిల్లా అడిషనల్ ఎస్పీ మహేందర్ ఆదివారం సందర్శించారు. తూప్రాన్ పట్టణంలో 2 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో 288, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 288 మంది అభ్యర్థులు గ్రూప్ 2 పరీక్షలు వ్రాసేలా ఏర్పాట్లు చేశామని తహశీల్దార్ ఎస్.విజయలక్ష్మి తెలిపారు. తూప్రాన్‌లోని 2 పరీక్షా కేంద్రాలలో 576 మంది గ్రూప్ 2 అభ్యర్థులకుగాను ఒక కేంద్రంలో 108, మరొక కేంద్రంలో 110 (37.8 శాతం) మంది అభ్యర్థులు మాత్రమే ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు రాశారని, 358 (62.1 శాతం) మంది గైర్హాజరైనట్లు తెలిపారు. తూప్రాన్ లోని రెండు పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ మహేందర్ పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మన్నె ప్రభుదాస్,తూప్రాన్ ఎస్సై శివానందం, మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్, రెవెన్యూ సిబ్బంది, ౦౧తీ౦౧ఋఋ పాల్గొన్నారు.

ఆదర్శంగా ఉన్న రాష్ట్రాన్ని.. ఆగం చేస్తున్నారు

- రేవంత్ రెడ్డి వచ్చిండు.. హైడ్రా తెచ్చిండు
- అమాయకులను బలి చేస్తుండు
- మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు



నవతెలంగాణ-అమీన్‌పూర్

అభివృద్ధిలో ఆదర్శంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని ఆరు నెలల్లోనే ఆగం చేశారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. అమీన్పూర్ మున్సిపాల్టీ ఐలాపూర్‌కి చెందిన బీఆర్ఎస్ నాయకులు మాణిక్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హరీశ్‌రావు హాజరయ్యారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఆయన రాష్ట్రంలో జరుగుతున్న కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగారు. ఎంతో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ ఒక్కొక్క మెట్టు పేరుస్తూ దేశంలోనే అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దితే.. కాంగ్రెస్ పాలనలో అది పూర్తిగా బూడిదలో పోసిన పన్నీరు చేసిందన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసపూరితంగా గద్దెకెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అనుచరులకు అప్పనంగా ఆస్తులు కట్టబెడుతున్నారని.. ప్రశ్నించిన ప్రతిపక్షాలకు మాత్రం తిట్లు తిడుతూ రాక్షసనందం పొందుతున్నాడని ఆరోపించారు. రేవంత్ తీరుపై అధిష్టానం సైతం గుర్రుగా ఉందని.. మూడు రోజుల ఢిల్లీ పర్యటనలో ఏఐసీసీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, సోనియాగాంధీ అపాయింట్మెంట్ దొరకని దుర్భర పరిస్థితిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని విమర్శించారు. క్రికెట్ ఆటలో హిట్ వికెట్ ఎలాగో ఏడాది పాలనలో సీఎం రేవంత్ రెడ్డి పరిస్థితి అదేనని విమర్శించారు. ఏడాది పాలలో పేద ప్రజల కోసం ఒక్క ఇల్లు కట్టని కాంగ్రెస్ ప్రభుత్వం.. హైడ్రా పేరుతో నిరుపేదల ఇల్లు కూలుస్తూ దుర్మార్గ పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రశ్నించిన ప్రతిపక్షాలపై.. ప్రజలపై దాడులు చేస్తూ.. అక్రమ కేసులు బనయిస్తున్నారని విమర్శించారు. నేటి నుండి జరుగునున్న అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడుతూ.. ప్రజల పక్షాన నిలుస్తామన్నారు. ఇకనైనా సీఎం రేవంత్ రెడ్డి తన స్వార్థ ప్రయోజనాలను పక్కనపెట్టి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచిం చారు. లేదంటే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో చిప్ప గతి పడుతుందని హెచ్చరించారు. విన్నర్‌గా నిలిచిన సత్య లేవన్ టీమ్,రన్నర్ గా నిలిచిన ఐలాపూర్ టీమ్ లకు బహుమలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, పటాన్చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్,. సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సోమి రెడ్డి, అమీన్ పూర్ మున్సి పల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మహాపడిపూజలో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ-మెదక్ డెస్క్

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప స్వాములు ఆదివారం నిర్వహించిన మహా పడిపూజ కార్యక్రమంలో మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు మాజీ మంత్రి హరీష్ రావుకు స్వాగతించిన అనంతరం అయ్యప్ప గర్భగుడిలో హరీశ్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వాదం తీసుకున్నారు. అయ్యప్ప గురుస్వాములు మాజీ మంత్రి హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులకి ఎల్లవేళలా అయ్యప్పస్వామి ఆశీస్సులు ఉండాలని, నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులు సంతోషంగా ఉండాలని కోరుతూ అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రాబందుల కబంధ హస్తాల్లో బలి కాకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి బూరుగుపల్లి ప్రతాపరెడ్డి, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, తూప్రాన్ మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బాబుల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సత్యనారాయణ గౌడ్, కౌన్సిలర్లు బొంది వెంకట్ గౌడ్, భైరం సత్యలింగం, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మన్నె శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సతీష్ చారి, ఎక్కలదేవ్ వెంకటేష్ యాదవ్, బాయికాడి ఆంజనేయులు, స్వామి గౌడ్, వెంకటేష్, గుర్రం ఆంజనేయులు, మాజీ సర్పంచులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప గురు స్వాములు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- డిప్యూటీ కలెక్టర్ వి.రాములు



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని విద్యానగర్ డిప్యూటీ కలెక్టర్ వి.రాములు అన్నారు. ఆదివారం మిర్జాపూర్ బి ఉన్నత పాఠశాలలో 2000-01 సంవత్సరానికి చెందిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఏర్పాటుచేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను కూడా నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వాడినే కనుక ఈ పాఠశాలలో ఉపాధ్యాయునిగా విద్యాబోధన చేస్తూ ఉన్నత చదువులు అభ్యసించి నేడు డిప్యూటీ కలెక్టర్ స్థాయికి ఎదగలిగినానన్నారు. నా వద్ద విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు నేడు దేశ విదేశాల్లో వివిధ హోదాలతో పాటు ఉపాధ్యాయులుగా, ఎస్సైలుగా స్థిరపడడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నదన్నారు. కేవలం కార్పొరేట్ పాఠశాలల్లో విద్యను అభ్యసించిన వారు మాత్రమే కాంపిటేటివ్ పరీక్షల్లో నెగ్గి ప్రభుత్వ ఉద్యోగాలను సంపాదిస్తారని ఉన్న అపోహను మిర్జాపూర్ బి పాఠశాల విద్యార్థులు పూర్తిగా తొలగించారన్నారు. ఆ సంవత్సరంలో మొత్తం 89 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాసి అందరూ ఉత్తమమైన మార్కులతో పాస్ అవ్వడం నాటి ఉపాధ్యాయులకు ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. విద్యను బోధించిన ప్రధానోపాధ్యాయులు కాజామైనది బసవరాజ్, స్వామి, దాస్ లతోపాటు నలుగురు విద్యార్థులు కూడా మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ పాఠశాలలో పదో తరగతిలో జిల్లా, రాష్ట్ర, పాఠశాలలో మొదటి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తానని ప్రకటించారు. పూర్వ అధ్యాపకులు సైదులు, విశ్వనాథం, వెంకటేశం, రాజు నాయక్, శ్రీకాంత్ మాట్లాడుతూ.. నాటి విద్యార్థులు ఎంతో క్రమ శిక్షణతో విద్యను అభ్యసించినందువల్లనే ఈరోజు వివిధ రంగాల్లో రాణించ గలుగుతున్నారన్నారు. విద్యార్థులు వెంకట్ రెడ్డి, మహిపాల్ మాట్లాడుతూ.. తాము ఈరోజు ఈ స్థాయిలో స్థిరపడడానికి తమ అధ్యాపకులే కారణమన్నారు. ప్రస్తుత డిప్యూటీ కలెక్టర్ రాములు సార్ మీర్జాపూర్ గ్రామం లోనే అద్దెకు ఉంటూ తాను ఉంటున్న ఇంట్లోనే విద్యార్థులకు విద్య యొక్క పరిజ్ఞానాన్ని నేర్పించేందుకు ఎన్నో విధాలుగా కృషి చేసినందు వల్లనే తాము ఈరోజు ఈ స్థాయికి ఎదగలిగినామన్నారు. రియజ్,లక్ష్మి, రాణి, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, లో మాట్లాడుతూ.. విద్య ప్రాముఖ్యతను తెలుపుతూ నాటి గురువులు తమకు నేర్పిన క్రమశిక్షణ ఆత్మ ధైర్యం తోనే తాము ఈరోజు రాణించగలుగుతున్నామ న్నారు. ఫసియొద్దీన్, లాల్ మొహమ్మద్, వనిత నువ్వు మాట్లాడుతూ ఏ రోజు కూడా తమకు విమర్శించకుండా ఎప్పుడు ఏ అనుమానం వచ్చినా ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ పరీక్షల్లో రాణించేందుకు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వెంకట్ రెడ్డి, భాస్కర్, గోపాలరెడ్డి, జైపాల్ లతోపాటు గ్రామస్తులు డిప్యూటీ కలెక్టర్, ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు.

కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



నవతెలంగాణ-జోగిపేట

ప్రజల అవసరాలు తీర్చకుండా ధరలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఉద్యమించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.మల్లేష్ పిలుపునిచ్చారు. సిపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహా సభలు జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం జోగిపే టలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు- కార్మికవర్గంపై ప్రభావంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, కర్షకుల పేదల ఆలోచన లేకుండా పెట్టుబడిదారులు అంబానీ జపం తప్ప మరేం లేదన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కుల మీద దాడి చేస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నిర్ణ యాలు చేస్తుందని విమర్శించారు. దేశానికి అన్నం పెడు తున్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించి సబ్సిడీ రుణాలు ఇవ్వాలని అడిగితే గిట్టుబాటు ధర కల్పించకుండా రైతు వ్యతిరేకంగా నాలుగు నల్ల చట్టాలను తెచ్చి రైతాంగాన్ని ఇబ్బందులు పెడుతు న్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమ ంలో జిల్లా సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు అందోల్ ఏరియా కార్యదర్శి విద్యాసాగర్, కమిటీ సభ్యులు నాగభూషణం, కృష్ణ, రాములు, సంతు నాయకులు సురేష్, శివకుమార్, పెంటయ్య, నరేందర్, సత్యం పాల్గొన్నారు.

వివాహా వేడుకల్లో పాల్గొన్న వై.నరోత్తం

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని పీవీఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన పి.ప్రవీణ్ కుమార్ కుమార్తె వివాహా వేడుకల్లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం పాల్గొన్నారు. నూతన వధూ వరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో అనుషమ్మ, పద్మమ్మ,రాంశెట్టి,చెంగల్ జైపాల్, మహ్మద్ ఫయాజ్,మధు సుధాకర్, జనార్దన్,వినీల్ కుమార్, నాగు,దిలీప్, తదితరులు పాల్గొన్నారు.



దత్త జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

నవతెలంగాణ-రామచంద్రాపురం



భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో గల గురుసాయి బాబా మందిరం శ్రీ దత్త జయంతి మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు అనిత, ప్రసాద్, సావిత్రి, మాజీ డైరెక్టర్ సత్యనారాయణ, లక్ష్మి, స్వర్ణ లత, సంధ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పనిలో నిబద్ధత, నైపుణ్యత అవసరం

- అప్పుడే విజయాలు వెతుక్కుంటూ వస్తాయి
- హైకోర్టు జడ్జి మాధవి దేవి

నవతెలంగాణ-జహీరాబాద్

పనిలో నిబద్ధత నైపుణ్యత ఉంటే విజయాలు వెతుక్కుంటూ వస్తాయని హైకోర్టు జడ్జి మాధవి దేవి అన్నారు. పస్తాపూర్‌లోని ఎస్వీ కళ్యాణమండపంలో వికాస సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో వికాస సంస్థ వారు మహిళలకు గత రెండు నెలలుగా కుట్టు మిషన్‌లో శిక్షణ ఇచ్చి వారందరికీ ఉచితంగా కుట్టు మిషన్లను, సర్టిఫికెట్లను పంపిణీ చేయడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. మహిళలు నేడు ప్రతీ రంగంలో రాణిస్తూ తమకంటూ ప్రాధాన్యతను చాటుకుంటు న్నారన్నారు. భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ ఆకాశంలోకి వెళ్లి నెలల తరబడి అక్కడే ఉండి తన మనోధైర్యాన్ని కోల్పోకుండా ఎన్నో పరిశోధనలు చేసి భూమిపైకి పంపుతున్నార న్నారు. ఎక్కడైతే మహిళలు అక్షరాస్యులుగా ఆర్థికంగా సామాజి కంగా అభివృద్ధి చెందుతారో ఆ దేశం పురోగతి చెందుతుందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా తమ ముందుకు వచ్చిందన్నారు. కోల్ ఇండియా సంస్థల్లోనూ ఎంతో మంది మహిళలు నేడు బొగ్గులు తవ్వుతూ ఉపాధి పొందుతున్నారన్నారు. ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావు అని.. ఆత్మహత్యలు చేసుకునే ముందు ఒక్కసారి వివేకానంద జీవిత చరిత్ర గురించి వినాలి, చదవాలి అని విజ్ఞప్తి చేశారు. వికాస స్వచ్ఛంద సంస్థ లక్ష్మారెడ్డి తమకు ఉన్న అనుబంధాన్ని కోల్ ఇండియా సంస్థతో ఏర్పరచుకొని అక్కడి నుండి సి ఎస్ ఆర్ నిధులు తీసుకువచ్చి తన ప్రాంతమైన జహీరాబాద్లో ఉచితంగా కుట్టు మిషన్లు నేర్పించి కుట్టు మిషన్లను సైతం పంపిణీ చేయడం ఎంతో హర్షించేదగ్గ విషయమ న్నారు. వికాస సంస్థ చైర్మెన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మొదటి దశలో 180 మంది మహిళలకు రెండునెలల పాటు కుట్టు శిక్షణలో శిక్షణ ఇప్పించి ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేయడం జరుగుతుంది. త్వరలోనే మరో రెండు బ్యాచులను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ శుక్లవర్ధన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, హనుమంత రెడ్డి, కొత్తకాపు శిరీష, సత్యనారాయణ, కోశిరెడ్డి, సుభాష్ రెడ్డి సురేందర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి,భాస్కర్, శ్రీని వాస్, మాజీ సర్పంచ్ పార్వతీ ప్రతాపరెడ్డి, జహీరాబాద్ ఇంచార్జ్ జూనియర్ సివిల్‌జడ్జిసురేందర్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి వాటర్ పోలో పోటీలకు అబ్దుర్ రహ్మాన్, అలియా ఫాతిమా ఎంపిక



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్ నుంచి మొహమ్మద్ అబ్దుర్ రహ్మాన్ సిద్ధిఖ్, అలియా ఫాతిమా వాటర్ పోలో లో జాతీయ స్థాయిలో ఎంపికయ్యారు. దాంతో టీఎస్జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 7న జయశంకర్ భూపాలపల్లి లో రాష్ట్రస్థాయి వాటర్ పోలో ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికల్లో సంగారెడ్డి జిల్లా నుండి బాలల విభాగం నుండి మహమ్మద్ అబ్దుర్ రెహ్మాన్ సిద్ధిఖ్, బాలికల విభాగంలో ఆలియా ఫాతిమా ఎంపికయ్యారు. ఈనెల 27న విజయవాడలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని పిడి స్విమ్మింగ్ కోచ్ శేషు కుమార్ తెలిపారు. డీవైఎస్ఓ కాసీం బేగ్, స్విమ్మింగ్ పూల్ సిబ్బంది పవన్, కృష్ణ అభినందనలు తెలిపారు.



వివాహా వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

నవతెలంగాణ-మనూర్

మండలం కేంద్రానికి చెందిన ఎర్రా విష్ణువర్ధన్‌రెడ్డి వివాహ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో పీసీసీ సభ్యులు కె.శ్రీనివాస్ పాల్గొని.. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాగా ఆయన్ను విష్ణువర్ధన్ తల్లిదండ్రులు శాలువా కప్పి సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుభాష్ రావ్ పాటిల్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో సీపీఐ(ఎం) ఇంటింటి కార్యక్రమం

నవతెలంగాణ-జహీరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో సీపీఐ(ఎం)ఇంటింటి కార్యక్రమంను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు మహిపాల్ మాట్లాడుతూ.. నిత్యం ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) పోరాడుతున్నదన్నారు. మహాసభల విజయవంతం కోసం విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ఇంటింటి విరాళాలు సేకరిస్తున్నామన్నారు. ప్రజలు ఎర్రజెండా మహాసభలకు ఆర్థికంగా, హార్దికంగా సహకరిస్తున్నారన్నారు. భవిష్యత్తులో మరిన్ని సమరశీల పోరాటాలు సాగించే దిశగా ఈ మహాసభల్లో నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు సలీమొద్దీన్, తిరుపతి, రాజేష్, బక్కన్న, తదితరులున్నారు.

కబ్జాదారుల నుంచి చిల్డ్రన్ పార్క్ స్థలాన్ని కాపాడాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని ఓడీఎఫ్ కాలనీ-2 చిల్డ్రన్ పార్క్ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. సంగారెడ్డి పట్టణంలోని వార్డు నెంబర్ 12 రాజంపేట 4వ బ్లాక్‌లో సర్వేనెంబర్ 385 మరియు 387లో గల ఓడిఎఫ్-2 వెంచర్ 1400 గజాల చిల్డ్రన్ పార్కును అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కోట్ల రూపాయల విలువ చేసే పార్క్ స్థలాన్ని కబ్జాకు పాల్పడుతున్నారని కాలనీవాసులు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. పార్కు స్థలాన్ని ఏరకంగా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. అక్రమ రిజిస్ట్రేషన్ వెంటనే రద్దు చేయాలని, కబ్జాలకు పాల్పడ్డ వాళ్లపై చర్యలు తీసుకోవాలని, పార్కు స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాలనీవాసులు మద్దతుగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.



మల్గిలో ముగిసిన మల్లన్న జాతర

నవతెలంగాణ-న్యాల్‌కల్

మల్గి గ్రామంలో మల్లన్న జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజున గ్రామ పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో మల్లన్న జాతర పల్లకి ఊరేగింపు కొనసాగింది. గ్రామస్తులు పూజలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు, తాజా మాజీ సర్పంచ్ మారుతి యాదవ్,గ్రామ భక్తులు ప్రజలు పాల్గొన్నారు.



పెద్దచెల్మడలో వైభవంగా మల్లన్న స్వామి కళ్యాణం

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని పెద్దచెల్మెడ గ్రామంలో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. ఈ కళ్యాణంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పైతర సాయికుమార్ మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ తదితరులు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు జెట్టి సుధా కర్, మండల నాయకులు బండారి పాండు, బీఆర్ఎస్ చిన్నచల్మెడ పార్టీ అధ్యక్షుడు ఒగ్గు మోహన్, నాయకులు బుర్ర సురేష్ , నర్సింలు, మాణయ్య ఆలయ ధర్మకర్త కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

లగేజీ భద్రపర్చడానికి రూ.100 వసూలు

- ఎమ్మెన్నార్ కళాశాలలో గ్రూప్-2 అభ్యర్థుల ఆందోళన
- ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్
- డబ్బులు వసూలు చేయొద్దని ఆదేశాలు

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి సమీపంలోని ఎమ్మెన్నార్ కళాశాలలో లగేజీ భద్రపర్చడానికి యాజమాన్యం డబ్బులు వసూలు చేస్తున్నదని గ్రూప్ 2 అభ్యర్థులు ఆందోళన చేపట్టార. సెల్‌ఫోన్‌కు రూ.50, బ్యాగ్‌లకు రూ.100 వరకు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయం తెల్సుకున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా సెల్‌ఫోన్ డిపాజిట్ కోసం రూ.50 వసూలు చేస్తున్నట్టు అదనపు కలెక్టర్‌కు అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. లగేజీ, సెల్‌ఫోన్‌లు భద్రపర చడానికి ఎలాంటి రుసుం వసూలు చేయొద్దని సిబ్బందిని, కళాశాల యజమాన్యంను ఆయన ఆదేశిం చారు. అభ్యర్థుల నుండి తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చివేయాలని సూచిం చారు. గ్రూప్-2 పరీక్ష నిర్వహిస్తున్న కేంద్రాల్లో సెల్ఫోన్ డిపాజిట్ కోసం ఎలాంటి డబ్బులు వసూలు చేయొద్దు ఆదేశించారు.



రేపటి ఛలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-హత్నూర

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలనే పలు డిమాండ్‌లతో రేపు (మంగళవారం) నిర్వహించ తలపెట్టిన ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు అన్నారు. మండల గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశాన్ని ఆదివారం దౌల్తాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులు అనేక ఏండ్ల నుంచి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్నా.. నేటికీ వారికి కనీస వేతనం అందడం లేదన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా గ్రామ పంచాయతీ కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. గత పదేండ్లలో వేతనాలు పెంచాలని అనేక సార్లు అడిగినా.. పెంచకుండా గత ప్రభుత్వం పని భారం పెంచిం దన్నారు. గతంలో సమ్మె సందర్భంగా తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచి రెగ్యులరైజ్ చేస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పారని.. అయితే అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి కనీస వేతనాలు, చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండ లంలో ఆరు నెలల నుండి వేతనాలు అందడంలేదని.. ఇలా ంటి పరిస్థితులతో పంచాయతీ కార్మికుడు ఎలా బతుకు తాడని ప్రశ్నించారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లిం చాలని లేని యెడల ఎంపీడీవో ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చ రించారు. వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, ఈఎస్, ఐపిఎఫ్ అమలు చేయాలని, రెగ్యులర్గా వేతనాలు చెల్లించాలని ఇతర సమస్యల పరిష్కారం కోసం రేపు జరిగే ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు నాగభూషణం, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు శంకర్, ఎల్లయ్య, వెంకటయ్య, అశోక్, రాములు, బిక్షపతి నాగయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మహాసభల విజయవంతానికి విరాళాల సేకరణ



నవతెలంగాణ-అమీన్‌పూర్

సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా అమీన్‌పూర్ మున్సిపాల్టీలోని జయలక్ష్మినగర్ కాలనీలో ఆదివారం ఇంటింటికి తిరుగుతూ ప్రజల నుంచి విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు నాయిని లలిత మాట్లాడుతూ.. జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభల విజయ వంతానికి విరాళాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. కార్మికులు, ఉద్యోగులు, కష్టజీవుల సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) పోరాడుతున్నదన్నారు. ప్రజాస్వామ్యంలో లౌకిక విధానం సామాజిక న్యాయం కోసం అంకితభావంతో ఉద్యమిస్తున్నదన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రజా సమస్యలపై ముందుండి పోరాడుతున్నదన్నారు. కాబట్టి ప్రజల కోసం పోరాడే సీపీఐ(ఎం)కు ప్రజలు అండగా ఉండి.. పెద్ద ఎత్తున విరాళాలు ఇచ్చి రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వాజిద్ అలీ, నాయిని నర్సింహారెడ్డి వివిధ కంపెనీల కార్మికులు, పలు ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వర్షిణ హాఫ్‌శారీ సెర్మనీ..

నవతెలంగాణ-జహీరాబాద్

స్థానిక గాంధీ మెమోరియల్ పాఠశాల నిర్వాహకులు గౌతం, రజనీ దంపతుల కూతురు వర్షిణ హాఫ్‌శారీ సెర్మనీ జహీరాబాద్ పట్టణంలోని మహంకాల్ కళ్యాణ మండపంలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ విద్యా సంస్థల నిర్వాహకులు దశరథ్ రెడ్డి, అయ్యప్ప రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీశైలం, మోహన్ రెడ్డి ,శ్రీనివాసరెడ్డి , సంపత్ కుమార్, నాగిరెడ్డి, చంద్రశేఖర్, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, మహంకాల్ తిరుమల్, నామరవి కిరణ్ గుప్తా, చందు గుప్తా, డాక్టర్ నాగరాజ్ పటేల్, డాక్టర్ శేషు, బాలగోపాల్, ఎన్ ఆర వెంకటేశం, ప్రముఖ సి ఏ అజయ్, దత్తు రెడ్డి, బిజీ సందీప్, జర్నలిస్టు సంఘాల నాయకులు సయ్యద్ మెహబూబా అలీ, శాస్త్రి, అబ్దుల్ హక్ ప్రముఖులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. గౌతమ్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.





సంగారెడ్డిలో సీపీఐ(ఎం) మెగా విరాళాల సేకరణ

నవతెలంగాణ-సంగారెడ్డి

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. ఈ మేరకు ఆదివారం సంగారెడ్డిలో సీపీఐ(ఎం) మెగా విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మెగా ఇంటింటా విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. మహాసభల ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. మహాసభకు సీపీఐ(ఎం) జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు సురేష్, మహేష్, విఠల్, మల్లారెడ్డి, చంద్రయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఉపయోగం



నవతెలంగాణ-అమీన్‌పూర్

ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని పటాన్‌చెరు డిఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ మండే మార్కెట్లో శ్రీ వేద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలందరూ ఆరోగ్యం పట్ల ఎంతో జాగ్రత్త ఉండాలన్నారు. నిరంతరం ఉదయం వాకింగ్, మంచి ఆహారాన్ని తీసుకోవడం, డాక్టర్లు సూచించిన విధంగా ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. శ్రీ వేద హాస్పిటల్ వారు ప్రజల కోసం ప్రత్యేకంగా ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయడం సంతోషకరమని అభినందించారు. అనంతరం హాస్పిటల్ యాజమాన్యం ఆయన్ను ఘనంగా సత్కరించారు. అనంతరం అమీన్పూర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ నరసింహ గౌడ్ స్థానిక నాయకులు,సుధాకర్ రెడ్డి, లింగం గౌడ్, పట్లోళ్ల భాస్కర్ రెడ్డి లను హాస్పిటల్ యాజమాన్యం వారు ఘనంగా శాలువాతో సత్కరించి జ్ఞాపకను బహుకరించారు. ఈ యొక్క కార్యక్రమంలో హాస్పిటల్ నిర్వాహకులు, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంపు కోసం ఫిబ్రవరి 10న ఛలో ఢిల్లీ

- జనవరి 1 నుంచి ఫిబ్రవరి 10వరకు దేశవ్యాప్త ప్రచారోద్యమం
- ఎన్పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

నవతెలంగాణ-సంగారెడ్డి



వికలాంగుల కనీస పెన్షన్ రూ.10,000ల పెంపు కోసం ఫిబ్రవరి 10న ఛలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్టు ఎన్పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య తెలిపారు. కేవల్ కిషన్ భవన్లో ఎన్పీఆర్డీ సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా ఉపాధ్యక్షురాలు సి. సాయమ్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ధరల పెరుగుదలకు అనుగుణంగా కనీస పెన్షన్ రూ.10,000లకు పెంచాలని డిమాండ్ చేశారు. 2011 నుంచి పెన్షన్లలో కేంద్ర ప్రభుత్వం వాటా కేవలం 300 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నదన్నారు. నిత్యావసర సరకుల ధరలు 300 రేట్లు పెరిగినా.. పెన్షన్స్ మాత్రం పెంచకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. ధరల పెరుగుదల సూచికి పెన్షన్స్ అనుసంధానం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఇందిరా గాంధీ జాతీయ వికలాంగుల పెన్షన్ పథకాన్ని వికలాంగులందరికి వర్తింపచేయాలన్నారు. రాజస్థాన్ రాష్ట్రం మాదిరిగా పెన్షన్ పొందడం వికలాంగుల హక్కుగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలన్నారు. 2015 డిసెంబర్ 3న అర్భాటంగా ప్రధాన మంత్రి ప్రారంభించిన సుగమ్య భారత్ అభియాన్ పథకం అమలు.. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు నిధుల కేటాయింపులో కేంద ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. ఫలితంగా 2024 పూర్తివుతున్నా లక్ష్యాన్ని చేరుకోలేకపోయామన్నారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థత వలన 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, 2017మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్,2007 ఐక్య రాజ్యా సమితి హక్కుల ఒప్పంద పత్రం,నేషనల్ పాలసీ, నేషనల్ ట్రస్ట్ వంటి కీలక చటాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. 2016 ఆర్‌పిడి చట్టానికి సవరణ చేయడానికి విడుదల చేసిన గెజిట్‌ను రద్దు చేయాలన్నారు. 2016 ఆర్‌పిడి చీఫ్ కమిషనర్, నేషనల్ ట్రస్ట్‌కు 10 ఏండ్ల నుండి చైర్మన్స్ నియమించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో వికలాంగులకు రిజర్వేషన్స్ అందని ద్రాక్షగా మారుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను గుర్తించి భర్తీ చేసేందుకు ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలన్నారు. ఇందిరా గాంధీ జాతీయ వికలాంగుల పెన్షన్ పథకాన్ని వికలాంగులందరికి వర్తింప చేయాలన్నారు. ప్రతీ ఏటా 15 శాతం పెన్షన్ పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో వికలాంగులు చేయడానికి అనువుగా ఉన్న పనులను గుర్తించి పని కల్పించాలన్నారు. దరఖాస్తూ చేసిన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు ఇచ్చి 200 రోజులు పని కల్పించాలన్నారు. జనవరి 1నుండి ఫిబ్రవరి 10 వరకు దేశవ్యాప్త ప్రచార ఉద్యమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి బుక్క ఇస్మాయిల్, ఉపాధ్యక్షులు మన్నే పోచయ్య, నాగయ్య, సహాయ కార్యదర్శులు నర్సిములు, రాంచంధర్, జిల్లా కమిటీ సభ్యులు కృపవారం,ఖలీల్ మియా, యదులు, లక్ష్మణ్, నరేష్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-మునిపల్లి

మునిపల్లి మండల పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి గంధం మల్లికార్జున్ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలుపుతూ దీక్ష శిబిరంలో పాల్గొన్నారు. గత తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతూ ఆదివారం సంగారెడ్డి జిల్లా దీక్ష శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్ని అర్హతలు ఉన్నా ఏళ్ల తరబడి కనీస వేతనం లేకుండా పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించి, వారి ప్రధాన డిమాండ్ అయిన సమాన పని సమాన వేతనాన్ని కల్పించాలన్నారు. పెరిగిన నిత్యవసరాల ధరలకు కుటుంబ పోషణ కూడా కష్టంగా ఉన్న తరుణంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. కేజీబీవి మరియు సమగ్ర శిక్ష ఉద్యోగులకు పీఆర్టీయూ సంఘం సంపూర్ణ మద్దతు అందిస్తుందన్నారు. సమగ్ర శిక్షణ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లు ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవి కవిత, నరేష్, సీఆర్పీలు పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-మెదక్



సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే పద్మారావు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు గత వారం రోజులుగా సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణంగా ఉందన్నారు. యుాటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే పద్మారావు ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పద్మారావు, కోశాధికారి రవీందర్ రెడ్డి, హవేలిఘనపూర్ అధ్యక్ష, కార్యదర్శులు యేసయ్య నర్సింలు, పాపన్నపేట్ భూషణం, కొల్చారం అధ్యక్షులు షాకిర్ అలీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

సోమవారం 16 డిసెంబర్ 2024 www.navatelangana.com

హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజావాణి

నవతెలంగాణ-మెదక్



జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం హెల్ప్ డెస్క్ ద్వారా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గ్రూప్ -2 పరీక్షలకు అధికారులు విధులకు హాజరవుతారని, విధులు నిర్వహించేందుకు అధికారులు అందుబాటులో ఉండకపోవడం మూలంగా ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

వ్యాపారులు లేక ఖాళీగా మార్కెట్ యార్డు

- దుకాణాల ఏర్పాటుకు ఆసక్తి చూపని వ్యాపారులు
- బయటే చిరువ్యాపారాలు
- పర్యవేక్షణ లోపమే కారణం
- సరిపడా లేని సిబ్బంది



నవతెలంగాణ- (మనోహరాబాద్)

కోట్లు వెచ్చించి నిర్మించిన వేసైడ్ మార్కెట్ వృధాగా ఉండిపోతుంది. మార్కెట్‌లోకి వాహనదారులు రాకపోవడంతో వ్యాపారాలు కొనసాగక చిరువ్యాపారులు తిరిగి రోడ్డునే ఆశ్రయిస్తున్నారు. దాంతో పాటు కోట్లు పెట్టి నిర్మించిన వేసైడ్ మార్కెట్‌లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. సరిపడా సిబ్బంది లేకపోవడం, అధికారులు లేకపోవడంతో పర్యవేక్షణ లోపంతో వేసైడ్ మార్కెట్ పూర్తిగా వృధాగా మారింది. నలుగురు వాచ్‌మెన్‌లు ఉండాల్సిన మార్కెట్‌లో కేవలం ఒకే వాచ్‌మెన్ విధులు నిర్వహించడంతో మార్కెట్‌లో సమస్యలు తీవ్రంగా ఉంటున్నట్టు చిరువ్యాపారులు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ఆర్థిక మంత్రి హరీష్‌రావ్ అట్టహాసంగా చిరువ్యాపారుల సౌకర్యం కోసం నిర్మింపచేసి ప్రారంభించిన మార్కెట్ ఆరు నెలలు కాకుండానే వ్యాపారాలు చేయకుండా వృధాగా ఉండిపోయింది. తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ శివారులోని టోల్‌గేట్ వద్ద చిరువ్యాపారులు పండ్లు, కూరగాయలను, సీజనల్ వ్యాపారాలను కొనసాగించే వారు. రోడ్డుపై వ్యాపారాలు కొనసాగించడం ప్రమాదకరమని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండడంతో, చిరువ్యాపారులు ఎండలో వానలో కూడా వ్యాపారాలు చేస్తుండడంతో రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్‌రావ్ చలించి వారి సౌకర్యం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.1.60 లక్షలతో సైడ్ మార్కెట్‌ను నిర్మించారు. నిర్మాణం పూరి కాగానే మార్కెట్‌ను హరీష్‌రావ్ అట్టహాసంగా ప్రారంభించారు. రోడ్డుపై చిరు వ్యాపారాలు చేసుకునే ప్రతి ఒక్కరూ వేసైడ్ మార్కెట్‌లోనే వ్యాపారాలు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దాంతో చిరు వ్యాపారులు వేసైడ్ మార్కెట్‌లోనే వ్యాపారాలు చేపట్టారు. కాగా టోల్‌గేట్ నుంచి వెళ్లే వాహనదారులు మార్కెట్‌లోకి రావడానికి అంత ఆసక్తి చూపించకపోతుండడంతో చిరువ్యాపారులు వ్యాపారం లేక ఇబ్బందులకు గురౌతున్నట్టు తెలుపుతున్నారు. దానికి తోడు సరిపడా సిబ్బంది లేకపోవడంతో పర్యవేక్షణలేక మార్కెట్‌లో పూర్తి స్థాయిలో సమస్యలు ఎదురౌతున్నట్టు తెలిపారు. వేసైడ్ మార్కెట్ ఏర్పాటు చేయడంతో అక్కడ ఒక ఎస్టేట్ ఆఫీసర్‌తో పాటు ఒక సెక్రటరిని కూడా ఏర్పాటు చేయాలి. దాంతో పాటు ఉదయం ఇద్దరు వాచ్‌మెన్‌లు, రాత్రి ఇద్దరు వాచ్‌మెన్‌లను ప్రతి రోజు నలుగురు వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేయాలి కానీ ఒకే వాచ్‌మెన్ ఏర్పాటుతో మార్కెట్‌లో పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. ఒక సెక్రటరిని కేటాయించినప్పటికి ఆ సెక్రటరికి గజ్వేల్ ఉండగా ఆయనకు మిరుదొడ్డి, తూప్రాన్‌లు అదనంగా ఉన్నాయి. దాంతో సెక్రటరి ఎక్కడా సమయం కేటాయించలేని పరిస్థితి నెలకొంది. ఇంకా ఎస్టేట్ అధికారి, ముగ్గురు వాచ్‌మెన్‌ల పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. కాగా ఇప్పటికే రూ.కోటి అరవై లక్షల వ్యయంతో నిర్మించిన వేసైడ్ మార్కెట్ వ్యాపారులు లేక వృదాగా ఉండిపోయాయి. సుమారు రూ.రెండు కోట్ల వ్యయంతో నిర్మించిన వేసైడ్ మార్కెట్ పర్యవేక్షణ లోపంతో వ్యాపారులు లేక వృదాగా మారిపోయింది, గతంలో కూడా వ్యాపారులను పోలీసుల సహకారంతో మార్కెట్‌లోనే వ్యాపారాలు నిర్వహించుకోవాలని హెచ్చరించినప్పటికి వ్యాపారులు మాత్రం రోడ్డునే ఆశ్రయిస్తున్నారు. రూ.కోట్లు వృధాగా మారాయి. వేసైడ్ మార్కెట్ లేని సమయంలో మండలంతో పాటు ఇతర మండలాల నుంచి అధిక సంఖ్యలో చిరువ్యాపారులు ఇక్కడికి వచ్చి వ్యాపారం చేసుకుని ఆనందంగా వెళ్లేవారని మార్కెట్ నిర్మాణంతో వ్యాపారాలు నడవక చిరు వ్యాపారులు రాక మార్కెట్ ఖాళీగా ఉండిపోతుంది. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వేసైడ్ మార్కెట్‌పై దృష్టి పెట్టి మార్కెట్‌ను వ్యాపారాలకు అనువుగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే రూ.కోట్ల వృధాను అరికట్టి వాడుకలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



వ్యాపారుల సౌకర్యం కోసం అనేక ఏర్పాట్లు

సెక్రటరి జాన్‌వెస్లీ

చిరువ్యాపారులు, రైతుల సౌకర్యం కోసం ప్రభుత్వం వేసైడ్ మార్కెట్‌ను నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. కానీ వ్యాపారం నడవడం లేదంటు తిరిగి రోడ్డుపైనే వ్యాపారాలు చేస్తున్నారు. వ్యాపారాలు మార్కెట్‌లోనే చేయాలంటూ అనేకసార్లు అవగాహన కల్పించామని అయినప్పటికి రోడ్డుపైనే వ్యాపారం చేస్తుండడంతో ముందు గ్రిల్స్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. వ్యాపారుల సౌకర్యం కోసం ఇక్కడ వేసైడ్ మార్కెట్ ఉందని కొనుగోలు దారులకు తెలవడానికి ఇరు వైపులా ఫైన్ బోర్డులను కూడా ఏర్పాటు చేశాం. అలాగే మార్కెట్‌లోకి వచ్చే కొనుగోలు దారులకు, వ్యాపారులకు సౌకర్యంగా ఉండే విదంగా వాష్‌రూంలను కూడా ఏర్పాటు చేశామని అక్కడ శుభ్రంగా ఉండే విధంగా ఒక సిబ్బందిని ఏర్పాటు చేసి వారికి రూ.8 వేల వేతనం కూడా ఇస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా వ్యాపారులు మార్కెట్‌లోనే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. వ్యాపారులకు ఉచితంగా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్టు రైతులు మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

వ్యాపారుల ఇబ్బందులు

వేసైసాడ్ మార్కెట్‌తో తమకు చాలా అన్యాయం జరిగింది. గతంలో రోడ్డుపై వ్యాపారం నిర్వహించే సమయంలో వ్యాపారం బాగుండేది. మార్కెట్‌లో దుకాణాలు పెట్టినప్పటి నుంచి వ్యాపారం లేక సుమారు వేల రూపాయలు అప్పులు చేయాల్సిన పరిస్తితి నెలకొంది. మార్కెట్‌లోకి వాహనాలు రాకపోవడంతో వ్యాపారం నడవడం లేదు. రోడ్డుపైనే దుకాణం పెడితేనే వ్యాపారం నడుస్తుంది. కానీ రోడ్డుపై పెడితే పోలీసులు బెదిరిస్తున్నారు.

మార్కెట్‌లో దుకాణాలు పెట్టినప్పటి నుంచి కనీసం పెట్టుబడి కూడా రావడంలేదు. వ్యాపారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన మార్కెట్ తమకు అన్యాయం జరుగుతుంది. గతంలో వ్యాపారాలు చేసి తమ కుటుంబాలను పోషించుకునే వారిమి. కానీ మార్కెట్ నిర్మించిన తరువాత వ్యాపారాలు లేక కుటుంబాలను పోషించుకోవాడం భారంగా మారింది. అనవసరంగా మార్కెట్‌ను నిర్మించారు. బయట దుకాణం పెడితే మున్సిపల్ వారు వచ్చి సామాగ్రిని తీసుకెలుతున్నారు. చాలా నష్టం జరుగుతుంది.

మూడు నెలల నుంచి వేతనం రావడంలేదు



వేసైడ్ మార్కెట్‌లో ఒకే ఒక్క వాచ్‌మెన్ ఉన్నాడు, నీటి వసతి బాగానే ఉంది తాను మార్కెట్‌లో టాయిలెట్‌ల వద్ద పనులు చేస్తాను. తనకు రూ.7 వేల వేతనం ఇస్తారు. అవి కూడా గత మూడు నెలల నుంచి రావడంలేదు. వేతనం రాక చాలా ఇబ్బందులు పడుతున్నాను. అలాగే టాయిలెట్‌లలో ఉపయోగించే రసాయనాలు తన వేతనంలో నుండే తీసుకురావాల్సి ఉంటుంది. తనకు వేతనం రాక ఇబ్బందులు పడుతున్నాను. త్వరగా వేతనం ఇప్పించండి.

టాయిలెట్ క్లీనర్ సిబ్బంది సుశీల

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-చేగుంట



చేగుంట మండల కేంద్రంలో జంగాల గణేష్ మరణించాడు. మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ ఆదివారం గణేష్ మృతదేహం వద్ద నివాళు లర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5000ల ఆర్థిక సహాయం అందజేశారు.

బగలాముఖీ అమ్మవారికి మహామంత్ర హావనం

- అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి మహాపూజలు..
- భక్తులతో కిటకిటలాడిన బగలాముఖీ శక్తిపీఠం

నవతెలంగాణ-శివ్వంపేట



దేశంలోనే అత్యంత శక్తిపీఠాలలోనే ఒకటైన శివ్వంపేట శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో పౌర్ణమి పర్వదినం సందర్భంగా అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో బగలాముఖీ అమ్మవారికి మహాపూజలు నిర్వహించారు. బగలాముఖీ అమ్మవారిని పీతవర్ణ పుష్పాలు, పీతవర్ణ వస్త్రాలతో విశేషంగా అలంకరించి, అమ్మవారికి విశేషమైన పసుపుతో హరిద్రార్చన నిర్వహించి, రుద్రాయామల, శ్రీసూక్త, దేవి సూక్త, బగలా అష్టోత్తర నామార్చనలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, మంత్రపుష్పం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల ఫలాలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం బగలాముఖీ శక్తిపీఠం ప్రాంగణంలో అమ్మవారికి మహామంత్ర హావనం అత్యంత వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి ప్రత్యేక పూజల సందర్భంగా అమ్మవారి భక్తులతో బగలాముఖీ శక్తిపీఠం కిటకిటలాడింది.

అమ్మవారి భక్తులకు అన్నదానం

అమ్మవారి దర్శనభాగ్యం కోసం విచ్చేసిన భక్తులందరికి తన తల్లిదండ్రులు స్వర్గీయ జిన్నారం పెద్దగోని లింగయ్య గౌడ్ - అంజమ్మ స్మారకార్థం గూడూరు గ్రామానికి చెందిన శ్రీగురుపీఠం ఫౌండర్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్- రమాదేవి దంపతులు అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-శివ్వంపేట



జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చెన్నాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముద్దగల్ల ఆంజనేయులు (32) భార్య పిల్లలను తీసుకొని గత నాలుగు సంవత్సరాల క్రితం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని గడ్డిమందు తాగి ఇంట్లో నుంచి బయటకు వచ్చి అరుస్తుండగా కుటుంబసభ్యులు గమనించి నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స పొందిన అనంతరం వైద్యుల సూచనల మేరకు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆంజనేయులు మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ముద్దగల్ల అశోక్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

శిథిలావస్థలో గ్రంథాలయం

- పాఠకులకు ఇబ్బందులు
- సొంత భవనంలో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కొనసాగింపు.
- వెంటనే పక్కా భవనంలోకి మార్చాలని పాఠకుల వేడుకోలు.
- చైర్ పర్సన్ మారుస్తారని ఆశావాహుల ఎదురుచూపు





నవతెలంగాణ-కౌడిపల్లి



శిథిలవస్థలో గ్రంథాలయంలో ఉండడంతో పాఠకులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కౌడిపల్లి మండలంలో 29 గ్రామపంచాయతీ ఉండగా 50 వేలకు పై జనాభా ఉండడంతో రోజువారీగా మండల కార్యాలయానికి ఇతర పనులకు దాదాపు 5 వేల నుంచి 6 వేల మంది వస్తుంటారు. ఒక కాలనీలో గ్రంథాలయం ఉండడంతో గ్రంథాలయం ఉన్నదా లేదా అని కొంతమందికి తెలియనే తెలియదు. అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా మారింది కౌడిపల్లి శాఖ గ్రంథాలయం పరిస్థితి. సొంత భవనం కలిగి ఉన్నా ఏండ్లు గడుస్తున్నా శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ భవనంలో శాఖ గ్రంథాలయం కొనసాగుతుంది. సుమారు పది సంవత్సరాల క్రితమే శాఖ నూతన భవనం నిర్మించినప్పటికీ అప్పటి పరిస్థితుల దృష్ట్యా గ్రంథాలయ పక్కా భవనంలో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయం కొనసాగుతూ వస్తుంది. శిథిలావస్థ గ్రంథాలయ భవనంపై 'నవ తెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం.

1985లో కమ్యూనిటీ భవనంలో ప్రారంభం

మండల కేంద్రమైన కౌడిపల్లి లో 1985 వ సంవత్సరంలో కొత్త కాలనీలో కమ్యూనిటీ భవనంలో శాఖ గ్రంథాలయం ప్రారంభించారు. కాలక్రమేన పాఠకులు, సభ్యత్వం, పుస్తకాల సంఖ్య పెరుగుతున్న తరుణంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గ్రంథాలయం సొంత భవనం నిర్మాణం పూర్తి అయింది

2014లో కొత్త భవనం నిర్మాణం

అయితే 2015లో మండలానికి కొత్తగా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ సబ్ డివిజన్ రావడంతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయంలో సబ్ డివిజన్ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. సుమారు పది సంవత్సరాలు గడుస్తున్నా పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని కొనసాగించటంతో పాత గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్న గ్రంథాలయంతో పాఠకులకు శాపంగా మారింది. ప్రభుత్వ నిర్వహించే పోటీ పరీక్షలకు చదువుకుందామంటే అరకొర వస్తువులతో గ్రంథాలయం కొనసాగుతుంది.



పోటీ పరీక్షల కోసం చదువుకునే విద్యార్థులకు తప్పని కష్టాలు

ఇది వరకు శాఖ గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉండడంతో పాటూ సౌకర్యాలు బాగుండడంతో పాఠకులకు, పబ్లిక్ సర్వీస్ ఎగ్జామ్స్‌కు ప్రిపేరు అయ్యేవారు. కానీ భవనం శిథిలావస్థకు చేరడంతో వసతులు భాగలేక పాఠకులకు, నిరుద్యోగ యువత మెదక్ తదితర ప్రాంతాలకు వెళుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం: పాఠకులు

శిథిలావస్థకు చేరిన భవనంలో చదవాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. భవనం పెచ్చులుడుతుంది గదిలో కూర్చొని చదువలంటే భయంగా ఉంది. వెంటనే సొంత భవనంలోకి మారిస్తే బాగుంటుంది.

నాలుగు మార్కులతో ఎస్ఐ జాబ్ కోల్పోయా



గ్రంథాలయం ఎప్పుడు మూసి ఉండడంతో గత కొన్ని సంవత్సరాలు క్రితం నిర్వహించిన పోలీస్ ఎస్ఐ జాబ్ కోసం హైదరాబాద్‌కి వెళ్లి చదువుకోవాల్సి వచ్చింది. కౌడిపల్లిలో గ్రంథాలయం ఉన్నా, పుస్తకాలు సరిపడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. నాలుగు మార్కులతో తాను ఎస్ఐ జాబ్‌ను కోల్పోయా. ఇప్పటికైనా గ్రంథాలయంలో గ్రూప్ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు అందుబాటులో ఉంచాలి.

తాటి ఆంజనేయులు

అతి త్వరలో సొంత భవన గ్రంథాలయం



సుహాసిని రెడ్డి,
మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

గత కొన్ని రోజులుగా గ్రంథాలయ సమస్యలు తమ దృష్టికి వచ్చాయి. అతి త్వరలో సొంత భవనం లోకి మారుస్తాం. పాఠకులు కోరినట్టు గ్రంథాలయం లో అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఉంచి, చదువుకునే విధంగా చేసంఅభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం.

ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వమే కట్టించాలి

- లబ్ధిదారుల వద్ద డబ్బులు లేకుంటే ఎట్లా?
- అప్పు తీసుకువచ్చి ఇండ్లు కట్టుకుందామంటే బిల్లులు ఎన్ని రోజులకు ఇస్తారో? ఏమో?
- అందుకే ప్రభుత్వమే కాంట్రాక్టర్లకు ఇచ్చి కట్టించాలని లబ్ధిదారుల వేడుకోలు

నవతెలంగాణ-నిజాంపేట



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఇందిరమ్మ ఇండ్లను మంజూరి చేస్తున్నందున ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లను కేటాయించడం చాలా సంతోషించదగ్గ విషయం. ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేదే నిరుపేదలకు. అటువంటిది నిరుపేదల దగ్గర లక్షల రూపాయలు ఎక్కడ ఉంటాయని మండల ప్రజలు కొందరు వాపోతున్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించి, ప్రభుత్వమే కట్టించేలా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. నిరుపేదలు అప్పులు తీసుకొచ్చి ఇండ్లు కట్టుకుంటారు కానీ ప్రభుత్వము బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారో ఏమోనని భయాందోళనతో ఉన్నారు. ప్రభుత్వము పునరాలోచించి ఇండ్లను ప్రభుత్వమే కట్టించేలా తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రెక్కాడితే డొక్కాడని జీవితాలు

గరుగుల రాజయ్య, నిజాంపేట నివాసి



రాష్ట్ర ప్రభుత్వము ఇందిరమ్మ ఇండ్లను పేదలకు నిరుపేదలకు మంజూరు చేస్తున్నామని చెప్తున్నది చాలా సంతోషకరమైన విషయం. రోజు కూలీ పని చేసుకుని బతుకే నిరుపేదలు ఎంతోమంది ఉన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలు మావి.డబ్బులు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. వడ్డీలకు తెచ్చి కట్టే పరిస్థితి లేదు. ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వమే కట్టించేలా తగు చర్యలు తీసుకోవాలి.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- చర్చలకు పిలిచి సమ్మెను విరమింపచేయాలి.
- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-శివ్వంపేట



సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ డిమాండ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ సంఘం నాయకులను ప్రభుత్వం చర్చలకు పిలిచి సమ్మెను విరమింప చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. సమగ్ర శిక్షలో కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. పేస్కేల్ ఇవ్వాలని కోరుతూ గత కొన్ని రోజులుగా ఉద్యోగులు సమ్మె చేస్తున్నారన్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాస్థాయిలో ఏపీఓ, సిస్టమ్ అనలిస్ట్, టెక్నికల్ పర్సన్లు, ఆపరేటర్లు, డిఎంఎంటి మెసెంజర్లు, మండల స్థాయిలో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్పీఎస్, మెసెంజర్లు, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో సిఆర్పిలుగా, పాఠశాల స్థాయిలో పార్ట్ టైం ఇన్స్ పెక్టర్లుగా, కేజీబీవీ యూఆర్ యస్ లలో, స్పెషల్ ఆఫీసర్లు పీజీసీ ఆర్టీలు ,సీఆర్టీలు,పిఈటీలు, ఏఎన్ఎం, అకౌంటెంట్లు,క్రాఫ్ట్, కంప్యూటర్ ఇన్స్పెక్టర్లు,కుక్ వాచ్ ఉమన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు,18 ఏండ్లుగా అతి తక్కువ వేతనాలకే పని చేస్తున్నారన్నారన్నారు. ఏండ్లు గడుస్తున్న ఒకే వేతనం తప్ప పెరుగుతున్న నిత్యవసరాలు అనుగుణంగా వేతనం పెంచడం లేదని మండిపడ్డారు. కనీసం ఆరోగ్య కార్డులు, మహిళలకు ప్రస్తుతి సెలవులు, జీవిత బీమా చనిపోయిన ఉద్యోగ కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, అర్హులైన వారికి ప్రత్యామ్నాయ ఉద్యోగం వంటి చట్టబద్ధ సౌకర్యాలు అమలు కావడం లేదన్నారు. సమగ్ర ఉద్యోగులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకి చెందిన వారేనన్నారు. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు వారి సమస్యలు పరిష్కరిస్తానంటూ కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వానికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించకపోవడంతో నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారని, సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించి వారిని రెగ్యులరైజ్ చేయాలని, పేస్కేల్ అమలు చేస్తూ, బీమా సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ 25 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ నియమకాలో వెయిటేజ్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రిఎంగేజ్ విధానాన్ని రద్దు చేయాలని ఇతర న్యాయమైన సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నూతన 108 అంబులెన్స్ ప్రారంభోత్సవం

- రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

నవతెలంగాణ -వెల్దుర్తి

నర్సాపూర్ నియోజకవర్గం నూతనంగా ఏర్పడిన మాసాయిపేట మండల కేంద్రానికి 108 అంబులెన్స్ మంజూరు అయింది. మాసాయిపేట మండల కేంద్రంలో 108 అంబులెన్స్‌ను రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి మండల ప్రజా ప్రతినిధులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడారు. బి ఆర్ఎస్ ప్రభుత్వాలు నూతన మండలాలు ఏర్పాటు చేసి అరకొర కార్యాలయాలతో కొట్టుమిట్టాడుతూ అభివృద్ధికి దూరంగా ఉన్న మాసాయిపేట మండలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలనే గెజిట్ ముద్ర వేసి మాసాయిపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా సబ్బండ వర్గాలు అంబులెన్స్ ఉపయోగించుకోవాలని సూచించారు. అకింపేట గ్రామానికి గుంతలు మయంగా ఉన్న రోడ్డుతో ప్రజలు సతమ తమవు తున్న తరుణంలో రోడ్డు మంజూరు చేయించి త్వరలోనే పనులు ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టిన ఆవుల రాజిరెడ్డికి నాయకులు, గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. మాసాయిపేట మండలాన్ని రాష్ట్రంలోని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్న ఆవుల రాజిరెడ్డికి మండల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ నాగిరెడ్డి, మాజీ సర్పంచి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి మాజీ ఉపసర్పంచ్ నాగరాజ్ మాజీ సర్పంచ్ నాగరాజు, గోపీనాథ్ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



నవోదయలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-వర్గల్

మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ దాసి రాజేందర్, వైస్ ప్రిన్సిపల్ రమేష్ చేతులు జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. విద్యార్థులు భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఇచ్చారు, కూచిపూడి నాట్యంతో విద్యార్థులు అబ్బురపరిచారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ విద్యాలయానికి సంఘం చేసిన సేవలు, ఆర్థికపరమైన అంశాలను గురించి ప్రస్తావించారు. ఈ కార్యక్రమానికి శ్రీ మీరు హాస్పిటల్స్ అధినేత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మొదటి బ్యాచ్ నుండి చివరి బ్యాచ్ వరకు ఉన్న విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేశారు.

బండి సంజయ్‌ను కలిసి మొక్కను అందజేసిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్



ఆదివారం కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి హరిత మినర్వా హెూటల్‌లో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కేంద్ర మంత్రి జిల్లాలో ఓ వివాహ వేడుకల్లో పాల్గొనడానికి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఎసిపి మధు తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

- జిల్లా కలెక్టర్ లిఎం.మను చౌదరి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

డిసెంబర్ 16 వ తేదీ సోమవారం గ్రూప్ 2 పరీక్షలు ఉన్నందున కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి తెలిపారు. ఈ విషయాన్ని గమనించి సోమవారం ప్రజావాణి కార్యక్రమం కోసం జిల్లా ప్రజలెవరు కలెక్టరేట్‌కు రాకూడదని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఇథానాల్ పరిశ్రమల నిర్మాణాలను నిలిపివేయాలి

- బీఆర్ఎస్ గ్రామ శాఖాధ్యక్షుడు కొంకటి సురేశ్ డిమాండ్

నవతెలంగాణ-బెజ్జంకి



భవిష్యత్తు తరాలకు ముప్పుగా వాటిల్లనున్న మండల పరిధిలోని గుగ్గిల్ల గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథానాల్ పరిశ్రమల నిర్మాణాలను ప్రభుత్వం నిలిపివేయాలని బీఆర్ఎస్ గ్రామ శాఖాధ్యక్షుడు కొంకటి సురేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయమని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం గుగ్గిల్ల గ్రామ ప్రజల భవిష్యత్తుకు పట్టించుకోకపోవడం విడ్డూరమని సురేశ్ అసహనం వ్యక్తం చేశారు. దిలావర్ పూర్ రైతుల స్ఫూర్తితో ఇథనాల్ పరిశ్రమల రద్దుకు పోరాటం ఉధృతం చేస్తామని సురేశ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

జర మా ఎస్సీ కాలనీని పట్టించుకోరూ..

- అధికారులకు యువకుడు విజ్ఞప్తి

నవతెలంగాణ-బెజ్జంకి



పందులు, కుక్కలు, వానరాల స్వైర విహారంతో భయబ్రాంతులకు గురవుతున్నామని..అధికారులు జర మా ఎస్సీ కాలనీపై వివక్ష చూడకుండా పట్టించుకుని అరికట్టాలని స్థానిక యువకుడు లింగాల రాజశేఖర్ ఆదివారం విజ్ఞప్తి చేశాడు.వానరాల విహారంతో ఇంట్లో నుంచి అరుబయటకు రావడానికి కాలనీ వాసులు జంకుతున్నామని గ్రామ పత్యేకాధిరి ప్రత్యేక శ్రద్ధ వహించి వానరాల విహారాన్ని అరికట్టాలని రాజశేఖర్ కోరారు.

నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని వెంకటేశ్వర దేవాలయంలో సోమవారం నుంచి నెలరోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ రమేష్ విష్ణు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నెలరోజులపాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. జనవరి 10న ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వ విప్ శ్రీనివాస్‌ను కలిసిన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి

నవతెలంగాణ- సిద్దిపేట



వేములవాడ నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ని సిద్దిపేటలోని హరిత రెస్టారెంట్ వద్ద టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి జగ్గు మల్లారెడ్డి కలుసుకుని మద్దతు, ఆశీస్సులు ఉండాలని కోరారు. ప్రభుత్వ విప్ సానుకూలంగా స్పందించి, తప్పకుండా ఆశీస్సులు ఉంటాయని, విజయం సాదించాలని ఆకాంక్షించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు శ్రీనివాస్, లక్ష్మన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ సేవలు మరువలేనివి

నవతెలంగాణ-గజ్వేల్





అఖండ భారత రూపకర్త, ఉక్కు మనిషిగా పేరు గాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా సబ్బుబిళ్ళ మీద సర్దార్ చిత్రాన్ని అద్భుతంగా చిత్రించి చిత్రకారుడు రామకోటి రామరాజు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశపు మొదటి భారత ఉప ప్రధాన మంత్రి, దేశాన్ని ముక్కలు కాకుండ నిజాం నుంచి విముక్తి కల్పించిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని అయన సేవలను కొనియాడారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-కొండపాక

కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. 1989-90లో 10వ తరగతి బ్యాచ్ కు చెందిన వారు 25 సంవత్సరాలకు ఒకే చోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కాచం నవీన్ కుమార్, అమరేందర్ తదితరులున్నారు.

అన్ని గ్రామ పంచాయతీల్లో బీజేపీ మద్దతుదారుల పోటీ

నవతెలంగాణ- గజ్వేల్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి జయకేతనం ఎగురవేస్తుందని బిజెపి సీనియర్ నాయకులు మాదాడి జశ్వంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశలో ఆయన మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గంలో 177 గ్రామ పంచాయతీలు బిజెపి మద్దతు దారులు నిలబెడతామన్నారు. సిద్దిపేట జిల్లాలో జడ్పిటిసి, ఎంపిపి స్థానాలను గెలుపొందుతామన్నారు. కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి వెంకట్ రెడ్డి, గజ్వేల్ సింగిల్ విండో మాజీ చైర్మన్ కొన్నె రాజిరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు గులాం హైదర్ ఎగ్బాల్ పాల్గొన్నారు.



ఐక్య పోరాటంతో రెవిన్యూ డివిజన్‌ను సాధిద్దాం



నవతెలంగాణ-దుబ్బాక

రెవిన్యూ డివిజన్‌తోనే దుబ్బాక అభివృద్ధి సాధ్యమవుతుందని..రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం ప్రజలు కుల, మతాలు, రాజకీయాలకతీతంగా కలిసికట్టుగా పోరాడి రెవిన్యూ డివిజన్ ను సాధిద్దామని దుబ్బాక డెవలప్మెంట్ ఫోరం అధ్యక్షులు మాడబోయిన శ్రీకాంత్ కోరారు. రెవెన్యూ డివిజన్ డిమాండ్ ఏళ్ల నాటిదని, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డిలు ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని గుర్తు చేశారు. ఆదివారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని వర్తక సంఘంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో సీపీఐ(ఎం) దుబ్బాక మండల, మున్సిపల్ కార్యదర్శులు సింగిరెడ్డి నవీన, కొంపల్లి భాస్కర్, బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆస యాదగిరి, ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకోజ్ ప్రవీణ్ కుమార్ పలువురు హాజరై రెవిన్యూ డివిజన్ సాధన కోసం అనుసరించాల్సిన కార్యాచరణ పట్ల మాట్లాడారు. త్వరలోనే దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని పార్టీల నాయకులు,ప్రజాసంఘాల నాయకులతో జేఏసీగా ఏర్పడి రోజుకో విధంగా ఇక్కడి ప్రజల ఆకాంక్ష తెలుపుతూ ప్రభుత్వ దృష్టికెళ్లేలా కార్యచరణ రూపొందిస్తామన్నారు. రెవిన్యూ డివిజన్ సాధనలో కుల,మత,రాజకీయాలకతీతంగా అందరం కలిసికట్టుగా పోరాడదామని విజ్ఞప్తి చేశారు.ఈ అఖిలపక్ష సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు సాధిక్, లక్ష్మీనారాయణ, ఎల్లం, మల్లేశం, బీజేపీ నాయకులు శ్రీకాంత్, మల్లికార్జున్, వ్యాపారస్తులు బాలకృష్ణ, దీక్షిత్ పలువురు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలి

- 19న జరిగే చలో హైదరాబాద్
- జీఎంపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆలేటి యాదగిరి



నవతెలంగాణ-చేర్యాల

రెండు లక్షల నగదు బదిలీతోపాటు రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆలేటి యాదగిరి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. సమావేశంలో ఆలేటి యాదగిరి మాట్లాడుతూ రెండు లక్షల నగదు బదిలీతోపాటు రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19 న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో గొర్రెల మేకల పెంపకం దారులకు రూ.2 లక్షల నగదు బదిలీతో పాటు రెండో విడత గొర్రెలు పంపిణీ చేస్తామని సంవత్సరం గడిచిన ఊసేత్తడం లేదని, డీడీలు కట్టిన వేలాదిమంది పెంపకం దారులకు అధికారులు డీడీలు వాపస్ ఇచ్చి చేతులు దులిపేసుకున్నారని తెలిపారు. ప్రమాదవశాత్తు చనిపోయిన పెంపకందారులకు రూ.10 లక్షలు చెల్లించాలని, 50 సంవత్సరాలు నిండిన పెంపకం దారులకు రూ. 5 వేల పెన్షన్ ఇవ్వాలని, సీజనల్ వ్యాధులకు అనుగుణంగా వ్యాక్సిన్‌లను అందుబాటులో ఉంచా లని ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లాలోని గొర్రెల పెంపకం దారులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కర్రె శ్రీనివాస్, బియ్యసిద్దులు, కామల్ల అనిల్,నంగి చంద్రమౌళి పాల్గొన్నారు

సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

నవతెలంగాణ-గజ్వేల్



భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా గజ్వేల్ పట్టణ కేంద్రంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహ ఏర్పాటు కోసం భూమి పూజ కార్యక్రమం, మహనీయుల విగ్రహాల ఏర్పాటు కమిటీ, హైందవ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, డాక్టర్ నరేష్ బాబు, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పురోహితులు రాజశేఖర శర్మలు మాట్లాడుతూ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, భారతదేశ ఉప ప్రధానిగా విశేష సేవలు అందించారని, ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడిగా స్వాతంత్ర అనంతరం హైదరాబాద్, జునాగడ్ లాంటి సంస్థానాలు భారతదేశంలో విలీనం కావడానికి కృషి చేసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని గజ్వేల్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రహీం, నాయకులు నాయిని యాదగిరి, సుభాష్ చంద్రబోస్, శీర్ల మల్లేష్, బుక్క రమేష్, ఉప్పల ప్రవీణ్, బాలా కుమార్ సుంకరి, రమణ, పాత రాజు, జంగం రమేష్, కుడిక్యాల రాములు, అరవింద్, సురేష్, మహేష్, రాజేశం, డాక్టర్ సాయినాథ్, టీచర్ మల్లికార్జున్, వివిధ పార్టీల నాయకులు, హైందవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఎన్నికలు



నవతెలంగాణ-నంగునూరు

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నంగునూరు గ్రామం మహిళ కమిటీ ఎన్నిక, మాదిగ విద్యార్థి ఫెడరేషన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. మహిళా గ్రామ కమిటీ అధ్యక్షులుగా దేవులపల్లి బొక్కల చిన్న లక్ష్మి, అధికార ప్రతినిధిగా దేవులపల్లి రజిత, ఉపాధ్యక్షులుగా దేవులపల్లి కట్ట శ్యామల, దేవులపల్లి కొమ్మన్నగారి నవనీత, ప్రధాన కార్యదర్శిగా దేవులపల్లి యాదవ్వ, కార్యదర్శులుగా శివన్నగారి కనక లక్ష్మి, నాగలక్ష్మి, కోశాధికారిగా దేవులపల్లి సిద్దిపేట రేణుక, ప్రచార కార్యదర్శులుగా సిద్దిపేట చైతన్య, దేవులపల్లి వాణి, కార్యవర్గ సభ్యులుగా పాపిగారి కిష్టమ్మ, శివన్నగారి భారతి, పాపి గారి సాలవ్వ, దేవులపల్లి బాల రాజవ్వ, గౌరవ సలహాదారులుగా దేవులపల్లి జ్యోతి, దేవులపల్లి స్వరూప, పాపి గారి యాదవ్వ, పెరుమని సత్యవ్వ, పాపిగారి బాల్ లక్ష్మి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ గ్రామ కమిటీ ఎన్నిక అధ్యక్షునిగా దేవులపల్లి రాకేశ్ ,అధికార ప్రతినిధిగా నాగిళ్ల రవీందర్, ఉపాధ్యక్షులుగా దేవులపల్లి రవి, దేవులపల్లి శివ, ప్రధాన కార్యదర్శిగా దేవులపల్లి రాహుల్, కార్యదర్శులుగా పాపి గారి లక్ష్మణ్, దేవులపల్లి రాజు, కార్యవర్గ సభ్యులుగా దేవులపల్లి నవీన్ ,పల్నాటి చెర్రీ, దేవులపల్లి వంశీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ గ్రామ ప్రచార కార్యదర్శిగా శివన్నగారి మహేందర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు దేవులపల్లి బాలరాజు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దేవులపల్లి రాజమౌళి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దేవులపల్లి రాజేందర్, ఎంఎస్పీ మండల అధికార ప్రతినిధి దేవులపల్లి శంకర్, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి పల్నాటి రాజు, ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాపి గారి నరేశ్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దేవులపల్లి హరిబాబు, దేవులపల్లి చిన్న సిద్దయ్య, దేవులపల్లి బిక్షపతి, దేవులపల్లి చిన్న భూమయ్య, దేవులపల్లి పెద్ద భూమయ్య, దేవులపల్లి నర్సింగరావు, కులం పెద్దమనిషి పెరుమని యాదయ్య, దేవులపల్లి కొమ్మన్న గారి బాలరాజు, దేవులపల్లి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డి పల్లిలో ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

నవతెలంగాణ-ములుగు



రాష్ట్రంలో పంటలు సమృద్ధిగా పండి ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని అయ్యప్ప స్వామిని కోరుకున్నట్లు ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఆదివారం ములుగు మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో చల్ల నరసింహారెడ్డి అయ్యప్ప18 వ మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. చల్ల నర్సింహారెడ్డి 18వ మాలధారణ సందర్భంగా మహా పడిపూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అందంగా అలంకరణ పందిరిలో 18 మెట్లపై కొలువు దీరిన అయ్యప్ప ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్ డి సి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మెదక్ డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, బిఆర్ఎస్ యువజన నాయకులు కొమ్ము నవీన్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, తోపాట్ను అయ్యప్ప మాల దారులు, భారీగా భక్తులు అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు సందుగారి నర్సింహారెడ్డి, గామిడి వెంకటరెడ్డి, మహాదేవి మహేష్ గౌడ్, హనుమంతరెడ్డి, సంతోషరెడ్డి, పోచయ్య, బుచ్చిరెడ్డి పల్లెచ్చు యాదగిరి సన్నిధానం సాములు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు



- మర్కుక్ ఎస్ఐ దామోదర్
- కరకపట్ల పారిశ్రామికవాడలో తనిఖీ

నవతెలంగాణ-మర్కుక్

యువత గంజాయి ఇతర మత్తుపదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు పిల్లలను ఒక కంటితో కనిపెడుతూ ఉండాలని, గంజాయి రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని మర్కుక్ ఎస్ఐ దామోదర్ సూచించారు. ఆదివారం మర్కుక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్కపట్ల పారిశ్రామికవాడ అనుమానాస్పద ప్రాంతాల్లో గంజాయి ఇతర మత్తుపదార్థాల నివారణ గురించి నార్కటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మర్కుక్ ఎస్ఐ దామోదర్, మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ డా. అనురాధ ఆదేశాలతో కరకపట్ల పారిశ్రామిక వాడలో, ఇతర అనుమానాస్పద ప్రదేశాలలో డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు చేశామన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు , మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా లేక అక్రమంగా రవాణా చేసినా, పాన్‌షాప్‌లలో కానీ ఇతర షాపులలో అమ్మినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి ఇతర మత్తుపదార్థాలు ఎవరైనా కలిగి ఉంటే అమ్మినా, విక్రయించినా వెంటనే డయల్ 100 లేదా మర్కుక్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాగ్స్ స్క్వాడ్ హ్యాండ్లర్ కానిస్టేబుళ్లు అజయ్ కరుణాకర్ వర్క్ పోలీస్ సిబ్బంది ,తదితరులున్నారు .

సమైక్యతతో సాధించలేనిది ఏదిలేదు



నవతెలంగాణ-చేర్యాల

సమైక్యతతో సాధించలేనిది ఏదిలేదని పూర్వ విద్యార్థులు అన్నారు. పట్టణ కేంద్రంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం 1989-90 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలుసుకొని విద్యార్థుల సమ్మేళనం విషయంలో ప్రణాళిక వేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎవరి పనిలో వారు నిమగ్నమై ఉన్న క్రమంలో పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ ఇలాంటి కార్యక్రమాలను చేయడం వల్ల మానసికంగా దృఢంగా తయారవుతామన్నారు. తాము పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని మార్చిలో నిర్వహించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. 35 సంవత్సరాల క్రితం తమ పాత జ్ఞాపకాలు నెమరు వేసుకొని మానసిక ఆనందాన్ని పొందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హన్మంతు మరణం సీపీఐకి తీరని లోటు

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపె మల్లేశ్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ మండలంలోని పొట్లపెల్లి గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు బొల్లి హన్మంతు మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపె మల్లేష్ అన్నారు. ఆదివారం స్వగృహంలో అనారోగ్యంతో మరణించిన ఆయన భౌతిక కాయాన్ని సిపిఐ నాయకులు ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బొల్లి హన్మంతు నమ్మిన సిద్ధాంతం కోసం చిన్ననాటి నుండే సీపీఐ నిర్వహిస్తున్న ప్రజా పోరాటాలకు అకర్షనీయులయ్యారన్నారు. హన్మంతు కడవరకు సిపిఐని వీడలేదని గొప్ప వ్యక్తిత్వం కలిగిన నాయకుడిగా పని చేశారని గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డి, సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి మౌటం బాలయ్య, గ్రామ నాయకులు గడిపె మల్లేశం, జొన్నగడ్డలు రాజు, బొడ వెంకటమల్లు, బండి పోలయ్య, బండి ఎల్లయ్య, మాడిశెట్టి శ్రీదర్, బొల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బాల బ్రహ్మం



నవతెలంగాణ-కొండపాక

విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ బాలబ్రహ్మం ఎన్నికయ్యారు. హైదరాబాదులోని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం కార్యాలయంలో సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఎన్నికల్లో ఆయనను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్ మోహన్ ఆచార్యులు నియామక పత్రం అందజేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు లాల్ కోట వెంకటాచారి కోశాధికారి రవీంద్ర చారి ఉపాధ్యక్షులు రాళ్ల బండి విష్ణు చారి, రవీంద్ర చారి, శ్రీనివాసాచారి వివిధ జిల్లాల అధ్యక్షు కార్యదర్శులు పాల్గొన్నారు.

జప్తి నాచారంలో లేగదుడపై హైనా దాడి

నవతెలంగాణ-కొండపాక



కొండపాక మండలం జప్తి నాచారం గ్రామంలో లేగ దూడపై ఆయన దాడి చేసి చంపేసిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన మాస్తి పరశురాములు తన వ్యవసాయ పొలం వద్ద కొట్టంలో పశువులను కట్టేశాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూసేసరికి లేగ దూడపై చనిపోయి ఉంది. హైనా లేదా పులి దాడి చేసి చంపేసి ఉండవచ్చని భావిస్తున్నారు. లేగ దూడ చనిపోయిన ప్రాంతంలో రక్తపు చుక్క ఆనవాళ్లు ఏమాత్రం లేవని దీంతో హైనా లాంటిది దాడి చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. గ్రామాల పరిసర ప్రాంతంలో గతంలో పులి లాంటిది సంచరిస్తుందని అనుమానాలు ఉన్నాయి. లేగ దూడపై దాడి జరగడంతో రైతులు భయాందోళన గురవుతున్నారు.

నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
5
సోమవారం | 16 డిసెంబర్ 2024 | www.navatelangana.com

నిరుపేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్.



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ నాయకుడు మాజీ వార్డ్ సభ్యుడు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు, గాజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆదివారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 9 వ వార్డులో పర్యటించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, గాజుల శ్రీనివాస్ పాల్గొని వారు మాట్లాడుతూ నిరుపేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారంటీలు దశలవారీగా నెరవేరుస్తుందని ఇల్లు లేని నిరుపేదలకు ప్రజాపాలనలో దరఖాస్తులు పెట్టుకున్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ప్రభుత్వం అందజేస్తుందని ఇంటింటి సర్వేకు వచ్చిన అధికారులకు లబ్ధిదారులు సహకరించాలని కోరారు, బీఆర్ఎస్ పార్టీ కేవలం మాటలకే పరిమితమైందని కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పరిపాలన చేస్తూ అందరి మన్నన పొందుతుందన్నారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సబ్బని నరేష్, సాహేద్, గుంటుకు యాదగిరి, అస్గర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నూతన పట్టణ పద్మశాలి సంఘం ఎన్నిక

- అధ్యక్షుడిగా చేరాల రవీందర్



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ నూతన అధ్యక్షుడి ఎన్నికలు లక్ష్మి నరసింహ స్వామి ఆలయం వద్ద ఆదివారం నిర్వహించినట్టు గత కార్యవర్గ సభ్యులు తెలిపారు. నూతన పద్మశాలి సంఘం పట్టణాధ్యక్షుడిగా చేరాల రవీందర్ ఎన్నికయ్యారు. నూతన ఎన్నికైన రవీందర్‌ను కార్యవర్గ సభ్యులు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. గత కార్యవర్గ సభ్యుల సూచనలు సలహాలతో పద్మశాలి సమస్యల పరిష్కారించేలా శాయశక్తుల కృషి చేస్తానని రవీందర్ తెలిపారు. నూతన అధ్యక్షుడి ఎన్నికకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

వందేళ్ల పండుగకు ముస్తాబవుతున్న చర్చి

- మెతుకు కోసం వేలాదిమంది రాళ్లెత్తిన కూలీలు
- చర్చి నిర్మాణంతోనే జిల్లాకు 'మెదక్'గా పేరు
- 1914 నుంచి 1924 డిశంబర్‌లో నిర్మాణం పూర్తి
- ఈ నెల 23న శతజయంతి ఉత్సవాలు
- చర్చి నిర్మాణదాత చార్లేస్ వాకర్ పాస్నెట్ రక్తసంబంధికుల రాక
- ముఖ్య అతిథిగా హాజరుకాన్ను సీఎం రేవంత్‌రెడ్డి





నవతెలంగాణ-మెదక్

అది మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న తరుణం ...తినడానికి తిండిలేక చేద్దామంటే పనిచేవారులేక ప్రజలు ఆకలితో నకనకలాడి అలమటిస్తున్న రోజుల్లో మరో బాధాకరమైన విషయం ప్లేగు వ్యాధి(గత్తర)తో జనం కుప్పలు తెప్పలుగా చనిపోతున్న దుర్భరమైన పరిస్థితులు.. పట్టెడంత అన్నందొరికితే చాలు ఈ పూటకు బతికేస్తుంటిని అంటూ ప్రజలు కాలం వెళ్లదీస్తున్న దారుణ పరిస్థితి అది. దేశంకాని దేశం నుంచి ఖండతరాలు దాటి సముద్రపు ప్రయాణంగా సాక్షాత్తు పరలోకం నుంచి ప్రభువు పంపిన దేవదూతలాగ వచ్చాడు, అతనే "చార్లేస్ వాకర్ పాస్నెట్". ఇంగ్లాండ్ దేశస్థుడైన ఆయన ముందుగా సికింద్రాబాద్‌లోని అప్పటి మిలటరి(ఆర్మీ) సేనకు గురువుగా వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. అప్పటికే గ్రామీణప్రాంతాల్లో గత్తర వ్యాధిమూలంగా గుట్టలుగా చనిపోతున్న జనం ఇది మరింత ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండనేది వాడుకలో ఉంది. ఈ విషయం తెలుసుకున్న ఆయన గుర్రపుబండిపై సింకింద్రాబాద్ నుండి నేరుగా బయలు దేరి (ప్రస్తుత మెదక్) ఈప్రాంతానికి వచ్చాడని చెబుతున్నారు.



జనానికి తిండిపెట్టి...చర్చినిర్మాణం చేపట్టి

ఇంగ్లాండ్ దేశస్థుడైనా చార్లేస్ వాకర్ పాస్నెట్ ఈ ప్రాంతానికి రాగా ఇక్కడి దుర్భర పరిస్థితిని చూసి చలించిపోయాడు. తిండిలేక చనిపోతున్న వారిని ఆదుకోవాలనే తపన. ఆకలితో ఎవరు చనిపోకూడదని బావించిన ఆయన ఈ ప్రాంతంలో చర్చిని నిర్మాణం తలపెట్టాడు. అప్పుడు ఈ ప్రాంతం పేరు "గుల్షానాబాద్" కొనసాగుతుందని చరిత్ర. కాగా చార్లెస్ వాకర్ పాస్నెట్ తన స్వదేశం అయిన ఇంగ్లాండ్‌లో ఉన్నత చదువులు అభ్యశించిన వ్యక్తి చర్చి నిర్మాణం కోసం 200 నమూనాలను తయారు చేశారట. వాటి లో ఏదిశ్రేష్టమో తెలియక ఆందోళన చెందుతూ వాటన్నింటిని ముందు పెట్టుకుని మోకరిల్లి పరలోకదేవా ఇందులో ఏ నమోన ప్రకారం నిర్మించాలో దారిచూపు అంటూ ప్రార్థన చేయగా ఉన్నటుండి పెద్ద గాలి వచ్చి అందులోని 199 నమోన పేపర్లు కొట్టుక పోగా ఒకేఒక్క నమోన అక్కడే ఉందని అదే ప్రస్తుతం నిర్మించిన చర్చి నమోనా అని మత పెద్దలు చెబుతున్నారు.

చర్చినిర్మాణంతోనే 'మెదక్'కు పేరు

వేలాది మంది కూలీలతో పదేళ్లపాటు కొనసాగిన చర్చి నిర్మాణం కాలేకడుపులకు పట్టెడు మెతుకు ల కోసం కొనసాగిన నిర్మాణం అది. అప్పట్లో ఈ ప్రాంతానికి గుల్షనాబాద్ అని పేరు ఉండేదట. వేలాది జనం చర్చినిర్మాణంలో బాగస్వాములు కావటంతో ఎక్కడికి వెళ్తున్నారని అడిగితే 'మెతుకు' కోసం వెళ్తున్నామంటు జనం తండోప తండాలుగా పనికి వెళ్లేవారట. దీంతో ఈ ప్రాంతానికి గుల్షానాబాద్ నుండి మెతుకు సీమగా గాపిలిచిన జనం అది రానురాను మెదక్‌గా వాడుక బాషలో వచ్చింది ఈ జిల్లాకు మెదక్ పేరు రావటానికి చర్చే ప్రధాన కారణం అని చరిత్రచెబుతుంది.

చర్చినిర్మాణంలో డంగు సున్నమే కీలకం

చర్చి నిర్మాణంలో అప్పటి ఇంజనీర్లు డంగుసున్నం, బెండకాయలు, కోడిగుడ్లను తో జిగుటు కోసం గానుగ తిప్పి దీని నిర్మాణం కోసం ఉపయోగించారట. ఈ చారిత్రక కట్టడానికి సంబంధించి చర్చి గోపురం ఎత్తు 175 అడుగులు. పొడువు 200 అడుగులు, వెడల్పు 100 అడుగులు. ఈ కట్టడానికి మూడు గవాక్షములు, పలు రంగుటద్దములతో ప్రతిష్ఠింపజేశారు. తూర్పున ఏసుక్రీస్తు జన్మవృత్తాంతం. పడమర క్రీస్తును శిలువేసి దృశ్యం ఉత్తరాన క్రీస్తు చనిపోయి 3వ రోజు సజీవుడై ఆరోహనమై పోతున్న దృశ్యాలు కనిపిస్తాయి. వీటిని చేసిన కళాకారులు ఇంగ్లాండ్ దేశానికి చెందిన ఫ్రాంకోట, సాలిస్‌బరిలు. అంతే కాకుండా ఇవి సూర్యసష్మితో పగలు మాత్రమే కనిపిస్థాయి.సూర్య అస్తమయం అయిందంటే కనిపించవు. ఈ నిర్మాణం 1914 నుండి 1924 వరకు డిశంబర్ వరకు 10 ఏళ్లపాటు జరుగగా డిశంబర్ 25న, క్రిస్మస్ నాడు దీన్ని ప్రతిష్ఠించారు. ఈ నెల25తో శతజయంతి అవుతుంది. కాగా ఆధ్యాత్మిక, కళాత్మకతల మేళవింపుతో చారిత్మాక సీఎస్ఐ చర్చ్ ప్రసిద్ధిగాంచింది. ఈ నిర్మాణం బట్టి తెలుస్తోంది. ఆ నాటి ఇంజనీర్ల ఆకుంటిత దీక్ష, చర్చి పైకప్పు లోపలి భాగం చర్చి ప్రతిష్ఠించిన మూడేళ్ల వరకు ప్రతిధ్వనించేదని చెబుతుంటారు. అది ప్రతిధ్వనించకుండా 1927లో గోళాకారంలో ఉన్న లోపలిభాగాన్ని రబ్బరు, కాటన్, మరికొన్ని పలు రసాయనాలను ఉపయోగించి చర్చ్ ప్రతిధ్వనించకుండా చేశారు. దీనిని చేసిన బాడ్‌షా, గ్యాస్‌హెూప్ అను ఇంగ్లాండ్ ఇంజనీర్‌లు. ఈ చారిత్రాత్మక కట్టడం ఆసియాఖండంలోనే అద్భుత కట్టడం అంటారు. ఈ మొత్తం దేవాలయ నిర్మాత ఇంగ్లాండ్ దేశానికి చెందిన రన్‌కోన్ పట్టణానికి చెందిన "రెవరెండ్ చార్లెస్ వాకర్ పాస్నెట్"

బిక్షగాడిగ మారిన చార్లెస్ వాకర్ పాస్నెట్...!

చార్లెస్ వాకర్ పాస్నెట్ చర్చి నిర్మాణాన్ని మొదలు పెట్టిన కొన్నేళ్ల తరువాత అతని వద్ద ఉన్నడబ్బులు అయిపోయాయట. దీని నిర్మాణాన్ని ఎలాగైనా పూర్తి చేయాలని తపించిన ఆయన తన స్వదేశం ఇంగ్లాండ్‌కు వెళ్లి అక్కడ ఓ చర్చిముందు కూర్చొని తన తలమీద ఉన్న టోపితీసి బిక్షాటన చేశాడట. ఆదేశానికి చెందిన ఓ జర్నలిస్టు ఈ విషయాన్ని పత్రికలో ప్రచురించటంతో ఆ మరుసటి రోజు ధనవంతులు ఆయనను కలిసి బిక్షాటన చేయాల్సిన అవసరం ఏంటని(వై య్యార్ యు బెగ్గింగ్)

అని ప్రశ్నించటంతో ఇండియాలో నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి డబ్బులు తక్కువ పడ్డాయని చెప్పటంతో ఆదేశస్తులు పెద్ద మొత్తంలో విరాళాల రూపంలో ఇచ్చారట. దీంతో చార్లెస్ వాకర్ పాస్నెట్‌ను . ఇంగ్లాండ్‌లో (చర్చి బెగ్గర్) అని ఆదేశంలో పిలిచేవారట. అప్పట్లో దాని నిర్మాణం కోసం మొత్తం రూ. 14 లక్షల ఖర్చు వచ్చిందని చరిత్ర చెబుతుంది.

ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డిరాక

ఆసియా ఖండంలోనే అద్భుత చర్చిని నిర్మించి ఈ డిశంబర్ 25కు 100 సంవత్సరాలు పూర్తి కానుంది. 25న, క్రిస్‌మస్ ఉండటంతో ఈనెల 23న, శతజయంతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు చర్చి నిర్వాహకులు చర్చికి రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. 23న, 15 మంది బిషప్‌లతో తెల్లవారు ఝామునుండే ప్రత్యేక ఆరాదనలు జరుగుతాయి. ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అథితిగా రానున్నారు. అలాగే చర్చి నిర్మాణ దాత చార్లెస్ వాకర్ పాస్నెట్ రక్త సంబంధీకులు సైతం హాజరు అవుతారని చర్చి నిర్మాహకులు చెబుతున్నారు. ఇందులో భాగంగా మెదక్ డయాసిస్ పరిధిలోని ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, నిజమాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలో క్రికెట్, వాలీబాల్, త్రోబాల్‌తో పాటు కల్చరల్ ప్రోగ్రాములను నిర్వహిస్తూ చిన్నారుల కోసం పేయింటింగ్,డాన్సింగ్ తదితర పోటీలను నిర్వహిస్తున్నారు.



22న జరిగే ఎస్పీడీసీఎల్ కంపెనీ మహాసభను జయప్రదం చేయాలి

- ఆర్టిజన్ కార్మికులను కన్వెన్షన్ చేయాలి
- మీటర్ రీడర్లకు కనీస వేతనం అమలు చేయాలి
- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ మరాఠీ కృష్ణమూర్తి

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండలంలోని మునిగడప సబ్ స్టేషన్‌లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ మరాటి కృష్ణమూర్తి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 22న వనపర్తి లో జరిగే ఎస్పీడీసీఎల్ కంపెనీ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ఆర్టిజన్ కార్మికులందరినీ కన్వెన్షన్ చేయాలని, అర్హతలను బట్టి ఆర్టిజన్లందరినీ జేఎల్ఎం సబ్ ఇంజనీర్ సబ్ ఆర్డినేట్ తదితర ఉద్యోగాలకు కన్వెన్షన్ చేయాలన్నారు. మీటర్ రీడర్‌లకు కనీస వేతనం అమలు చేయాలని మీటర్ రీడర్లకు పీస్ రేటు పెంచాలని, మీటర్ రీడర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. నూతన మండల గౌరవ అధ్యక్షులుగా మరాఠీ కృష్ణమూర్తి, మండల అధ్యక్షులుగా అక్కరాజ శ్రీను ఉపాధ్యక్షులుగా హరిబాబు, పెరిక నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కొంగర స్వామి, కార్యదర్శివర్గ సభ్యులుగా కృష్ణారెడ్డి భాస్కర్ మధు శ్రీకాంత్, కోశాధికారిగా కర్నే భాస్కర్, ప్రచార కార్యదర్శిగా నరేష్ తిరుపతి, సలహాదారులుగా టీ మురళి కమిటీ సభ్యులుగా శ్రీధర్ , షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతు

- డెమొక్రటిక్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న సమగ్గ్ర శిక్ష ఉద్యోగులకు డెమొక్రటిక్ టీచర్ ఫెడరేషన్ కార్యవర్గం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సమస్యల పట్ల ప్రభుత్వానికి నిరసనగా తెలపడం కోసం సమగ్ర శిక్ష అభియాన్ నిరవధిక సమ్మె సెలవు రోజు సమ్మె చేశారు.సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సమ్మెకు మద్దతు డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఉపాధ్యక్షులు కార్యవర్గము సభ్యులు సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపినారు. మద్దతు తెలిపి వారికి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు . జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దేవులపల్లి కిష్టయ్య బాకీ చంద్ర భాను బాధ్యులు నర్సింలు రాములు ధర్నా శిబిరానికి హాజరై మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో ఏ సమస్య అయినా పోరాటాల ద్వారానే పరిష్కారం అవుతాయన్నారు. ప్రభుత్వము వెంటనే వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు సమాన పనికి సమాన వేతనం అందించాలని డిటిఎఫ్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా పాలన సక్రమంగా నిర్వహించాలంటే అందరి పాత్ర అవసరం ఉందన్నారు. వారి స్థానాల్లో ఎటువంటి ఇతర సిబ్బందిని పెట్టకుండా వారి న్యాయమైన కోరికలను పరిష్కరించాలని డిటిఎఫ్ డిమాండ్ చేస్తుందని తెలిపారు.



ఆత్మీయ అనురాగాలు పంచుకున్న పూర్వ విద్యార్థులు

- గురువులకు జ్ఞాపికలు అందజేత..

నవతెలంగాణ-మిరుదొడ్డి

చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ 1986-87 పదవతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం రోజున మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత ఉపాధ్యాయులు మాట్లాడుతూ తెలిసీ తెలియని వయస్సులో ఉన్న పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడమే గురువుల బాధ్యత అని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో చేసిన సేవలను గుర్తించి సన్మానించి జ్ఞాపికలను అందజేయడం ఎంతో సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. చీకటిలో వెలుగులు నింపడమే గురువుల కర్తవ్యమని అన్నారు. వివిధ రంగాలలో ఉన్న వారు సమాజానికి సేవ చేయాలని సూచించారు. 37 సంవత్సరాల తరువాత కలుసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేలేటి మృత్యుంజయ శర్మ పృథ్వీ రాజ్, రుస్తుంతో పాటు పూర్వ విద్యార్థులు గొట్టం కోటేశ్వర్, లింగాల రాజలింగా రెడ్డి, మంచాల చంద్రం, గరిపల్లి శ్రీనివాస్, అల్లాడి శ్రీనివాస్, నంద్యాల శ్రీనివాస్ రెడ్డి, వల్లాల సత్యనారాయణ, సత్తు గోవర్ధన్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, గున్నాల భిక్షపతి, వర ప్రసాద్ , ఆకుల మోహన్, చెన్నప్ప, మద్దెల లక్ష్మణ్ , మల్లికార్జున్‌తో పాటు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- తాజా మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్

నవతెలంగాణ-మిరుదొడ్డి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కావడం జరిగిందని తాజా మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని మోతే గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను తాజా మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ గ్రామస్థులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం నుంచి సీఎంఆర్ఎఫ్ ద్వారా నిధులను మంజూరు చేయడం ఎంతో సంతోషకరమని తెలిపారు. పేద ప్రజలకు సేవ చేయడానికి ప్రభుత్వం నుంచి డబ్బులను అందించడం జరుగుతుందని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా డబ్బులు అందించడం జరుగుతుందని తెలిపారు. చాకలి కనకయ్యకు రూ.27 వేలు, బొల్లు మల్లయ్యకు రూ.17 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నర్మెట రంజిత్. మడ్డి బాల్ నర్సాగౌడ్. బైండ్ల రామస్వామి. అల్వాల బుచ్చులు.చాకలి కిషన్. అల్వాల పొచయ్య తదితరులు పాల్గొన్నారు.



గోదాదేవి లోహ విగ్రహ ఏర్పాటు

నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని పాత వెంకటేశ్వర దేవాలయంలో భక్తుల సహకారముతో పంచ లోహాలతో తయారు చేయించిన గోదాదేవి అమ్మవారి నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు అలయ అధ్యక్షులు మాంకాల నవీన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భముగా శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా సమితి అధ్యక్షుడు గంప శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి ఉన్న వద్ద గోదాదేవి అమ్మవారు కూడా ఉండడం మంచిదనే ఉద్దేశించి నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా సోమవారం నుంచి ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు ధనుర్మాస హారతులు నిర్వహించబడతాయని తెలిపారు. భక్తులు ఈ ధనుర్మాస పూజల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమములో ఆలయ ప్రతినిధులు, సభ్యులు పుల్లూరి శివ కుమార్, కొర్తివాడ శ్రీనివాస్, కిషన్, కాచం కాశినాథ్, శ్రీనివాస్, గౌరీశంకర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం వెలికట్ట గ్రామానికి చెందిన అమ్ముల యాదయ్య (55) పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడి, గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన యాదయ్య పక్షవాతంతో రెండు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆసుపత్రులలో చికిత్స చేయించినప్పటికీ తగ్గకపోవడంతో బాధ భరించలేకపోయాడు. ఈ నెల 12న ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన భార్య రేణుక వెంటనే సిద్ధిపేట ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి శనివారం రాత్రి హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

గ్యారీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మెదక్ డెస్క్

తూప్రాన్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ పరిధి ప్రాంతంలో ఉన్న దర్గా వద్ద మైనార్టీ సోదరులు ఆదివారం నిర్వహించిన గ్యారీ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే డీసీసీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసి మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్,కౌన్సిలర్లు రవీంద్ర గుప్తా, రవీందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విశ్వరాజ్, నాగరాజుగౌడ్, ఉమర్, అనిల్, ఆర్ఎంపి డాక్టర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు అప్సర్, బొల్లు నాగులు, దుర్గం నగేష్, గుర్రం రాములు, కొత్తపల్లి నర్సింగరావు, మైనార్టీ పెద్దలు, సోదరులు తదితరులు పాల్గొన్నారు.

